


భారత్ ప్రతినిధి

తెలుగు దిన పత్రిక









సంపుటి: 3 సంచిక: 281 పేజీలు: 8 సంపాదకులు: రోళ్ళ రఘునాథ్ రెడ్డి ప్రచురణ: గుంటూరు మంగళవారం, 04 ఆగష్టు 2026 వెల: 2 రూ/- RNI No: APTEL/2023/88990

VOLUME: 3 ISSUE: 281 PAGES: 8 EDITOR: ROLLA RAGHUNATH REDDY PUBLISHED: GUNTUR TUESDAY, 04 AUGUST 2026 PRICE: 2 Rs/- BHARATH PRATHINIDHI

# బీహార్‌లో బీజేపీకి అతిపెద్ద షాక్

## బంకీపూర్ అసెంబ్లీ సీటు ఉపఎన్నికలో ప్రశాంత్ కిషోర్ ఘనవిజయం


6లో..


**జన్ సురాజ్ పార్టీకి తొలి గెలుపు.. ఇక అసెంబ్లీలోకి ఎంట్రీ**

**యువత, జెనీ మద్దతుతోనే విజయం: పీకే**

**నేరస్థుల పాలనకు ప్రజలు నో: పీకే**

## మాజీ మంత్రి అప్పలరాజు పోలీస్ కస్టడీకి కోర్టు అనుమతి


కాశీబుగ్గ: వైకాపా నేత, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును ఒక రోజు పోలీస్ కస్టడీకి పలాస జూనియర్ సివిల్ జడ్జి అనుమతిచ్చారు. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో గతనెల 10న జరిగిన రోడ్డు ప్రమాదంలో గొర్రెల కాపరి దానయ్య మృతి చెందిన విషయం విదితమే. ఈ కేసులో అప్పలరాజు కుమారుడు ఆరవ్ వర్మ, సిద్ధార్థ త్యాడీలను పోలీసులు అరెస్టు చేయగా బెయిల్‌పై విడుదలయ్యారు. ఇదే కేసులో ఏ3గా ఉన్న అప్పలరాజును అరెస్టు చేయగా ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లా అంపోలులోని జైలులో రిమాండ్‌లో ఉన్నారు. ఈ క్రమంలో పలాస పోలీసులు అప్పలరాజు కస్టడీకి పిటిషన్ వేయగా ఒక రోజు అనుమతిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలీసులు విచారించే అవకాశముంది.





## 'గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఏపీ' పనుల్లో వేగం పెంచండి: పవన్‌కల్యాణ్

అమరావతి: తీర ప్రాంత పర్యావరణ పరిరక్షణ, కోతల నివారణ చర్యల్లో భాగంగా చేపట్టిన ప్రాజెక్టు గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ పనుల్లో వేగం మరింత పెరగాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ (ఖుఖుఅ ఖుశ్రీఖుఅ) ఆదేశించారు. ఈ ఏడాది నిర్దేశిత లక్ష్యాలను వచ్చే రెండు నెలల్లో పూర్తిచేసేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని స్పష్టం చేశారు. గ్రేట్ గ్రీన్ వాల్ పనుల పురోగతిపై అటవీశాఖ ఉన్నతాధికారులతో పవన్ సమీక్షించారు. డివిజన్లవారీగా నిర్దేశించిన లక్ష్యాలు ఎంత వరకు పూర్తి చేశారు? ఇప్పటి వరకు ఎన్ని మొక్కలు నాటారు? ఈ ఏడాది మడ అడవులు ఎంత విస్తీర్ణంలో నాటనున్నారు? తదితర వివరాలను అంశాల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రేట్ గ్రీన్ వాల్ లక్ష్యసాధనలో భాగంగా గత రెండేళ్లలో సాధించిన పురోగతికి జాతీయ స్థాయి గుర్తింపు లభించిన అంశాన్ని పవన్ గుర్తు చేశారు. మడ అడవుల విస్తరణలో దేశంలో రెండో స్థానం సాధించేందుకు కృషి చేసిన అధికారులకు అభినందనలు తెలిపారు.



ప్రభుత్వ నిర్ణయాలతో డేటా వినియోగాన్ని పెంచాలని ఆదేశించారు. ఆయా శాఖల వారీగా డేటా సమన్వయంపై అధికారులతో సీఎం చంద్రబాబు చర్చించారు. ఇకపోతే కేంద్రప్రభుత్వం రాష్ట్రానికి సకాలంలో పన్నుల వాటా కేటాయిస్తుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు.

## డేటా ఆధారిత పాలనకు ప్రాధాన్యం

**డేటా ఆధారిత నిర్ణయాలపై సమీక్ష అధికారులకు దిశానిర్దేశం చేసిన సిఎం చంద్రబాబు**

అమరావతి: అన్ని శాఖల్లో డేటా ఆధారిత పాలనకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆర్‌టీజీఎస్‌లో డేటా ఆధారిత నిర్ణయాలపై సీఎం చంద్రబాబు సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. డేటా డ్రివెన్ మేకింగ్ డెసిషన్‌పై అధికారులకు సీఎం మార్గనిర్దేశర చేశారు. సీఎం సమీక్షకు ఏపీ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సాయిప్రసాద్, ఐటీ, ఆర్‌టీజీఎస్, వ్యవసాయం, మున్సిపల్, సంక్షేమ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. రియల్ టైమ్ గవర్నెన్స్ వ్యవస్థ పనితీరుపై ముఖ్యమంత్రి సమీక్షించారు. ఆర్‌టీజీ ద్వారా పాలన మరింత సమర్థవంతంగా, సులభంగా ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కేంద్ర సహకారంతో ఏపీలో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అదనపు పన్నుల వాటా కేటాయింపుపై ప్రధానమంత్రి నరేంద్రమోదీకి, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. సాధారణంగా ప్రతి నెలా 10వ తేదీన విడుదలయ్యే పన్నుల వాటాతో పాటు అదనంగా రూ.4,597 కోట్ల పన్నుల వాటా కేటాయించారని వెల్లడించారు. రాష్ట్ర పన్నుల వాటాను కేందప్రభుత్వం సకాలంలో కేటాయించడంతో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలకు మరింత బలం చేకూరుస్తుందని ముఖ్యమంత్రి తెలిపారు. అదనపు పన్నుల వాటా విడుదలతో ఏపీలో అభివృద్ధి కార్యక్రమాల అమలు మరింత వేగవంతం అవుతున్నాయని ఉద్ఘాటించారు. కేందప్రభుత్వం ఏపీ అభివృద్ధికి నిరంతరం అందిస్తున్న సహకారం రాష్ట్ర పురోగతికి ఎంతగానో దోహదపడుతోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.



## సింగరేణికి డీప్‌సైడ్ కోల్ బ్యాక్ దక్కదడం సంతోషకరం

**కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి**

న్యూఢిల్లీ: డిప్‌సైడ్ కోల్ బ్లాక్ సింగరేణికి దక్కడం సంతోషకరమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సింగరేణి కార్మికులకు, కార్మికుల కుటుంబ సభ్యులకు, కార్మిక సంఘాల ప్రతినిధులకు, సింగరేణి అధికారులకు. తెలంగాణ ప్రజలకు అభినందనలు తెలిపారు. ఈ మేరకు కిషన్‌రెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. ఇటీవల.. ఒడిశాలోని నైని కోల్ బ్లాక్, తాడిచర్ల -2 బ్లాక్ సింగరేణి సిగలో చేరిన సందర్భంలో.. ఖఐక్షఅ-2 డిప్ సైడ్ బ్లాక్‌ను కూడా సింగరేణికే దక్కేలా చొరవ తీసుకోవాలని కార్మికులు, యూనియన్ లీడర్ల నుంచి డిమాండ్లు వచ్చాయని ప్రస్తావించారు. ఖఐక్షఅ-2 డిప్‌సైడ్ బ్లాక్ సింగరేణికి వచ్చే విధంగా అన్నిరకాలుగా బాధ్యత వహించానని తెలిపారు. తాను కేంద్ర మంత్రిగానే కాకుండా తెలంగాణ బిడ్డగా.. సింగరేణి శ్రేయస్సు, అభివృద్ధి, సింగరేణి కార్మికులను ప్రేమించే వ్యక్తిగా ప్రత్యేక కృషి చేశానని చెప్పుకొచ్చారు. తన సహకారం ఫలితంగా సింగరేణి విజయం సాధించడం చాలా సంతోషకరమైన విషయమని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో సోమవారం వేలం ప్రక్రియ పూర్తయిపోయిందని వెల్లడించారు. ఈ విధానంలో సింగరేణి సంస్థకు మణుగూరు ఖఐక్షఅ-2 డిప్‌సైడ్ బ్లాక్‌ను కేటాయిస్తున్నట్లు తెలిపారు. దక్షిణ భారతదేశంలో ఉన్న ఏకైక బొగ్గు ఉత్పత్తి సంస్థ అయిన సింగరేణి సంస్థ.. ఈ డిప్ సైడ్ బ్లాక్ వల్ల సుమారు 180 మిలియన్ టన్నుల బొగ్గు రిజర్వ్ ఉన్నాయని వెల్లడించారు. ఈ సంవత్సరానికి 6 మిలియన్ టన్నుల చొప్పున 25 ఏళ్లపాటు ఈ మైన్ నడుస్తుందని స్పష్టం చేశారు. దాదాపు 2వేల మందికి ఉద్యోగాలు వస్తాయని కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఇక్కడ దొరికే ఉ-8 బొగ్గు కారణంగా.. మొత్తం రూ.43వేల కోట్లకు పైగా రెవెన్యూ జనరేట్ అవుతుందని చెప్పుకొచ్చారు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వానికి రూ.10,500 కోట్లకు మించి ఆదాయం కూడా వస్తుందని వివరించారు. తెలంగాణ ఇంధన భద్రతకు భరోసా దక్కడంతోపాటుగా.. సింగరేణి భవిష్యత్తు అభివృద్ధికి అవసరమైన వనరులు లభిస్తాయని వెల్లడించారు.




2లో..


# కర్నాటక కాంగ్రెస్‌లో విస్తరణ చిచ్చు

**20 మంది కొత్త మంత్రుల ప్రమాణం**

**చోటు దక్కని పలువురు ఎమ్మెల్యేల ఆగ్రహం**

**అసమ్మతి నేతల ఆందోళనలు..ధర్నాలు**

**ఎమ్మెల్యే యశ్వంతరాయ గౌడ పాటిల్ రాజీనామా**

అసమ్మతి నేతల రహస్య భేటీ: హెచ్‌కే పాటిల్, దినేష్ గుండూరావుతో సహా పదవులు దక్కని సీనియర్ నాయకులు బెంగళూరులోని పీ.వీ. జయచంద్ర నివాసంలో అత్యవసర రహస్య సమావేశం ఏర్పాటు చేసి తదుపరి కార్యాచరణపై చర్చిస్తున్నారు.

'పార్టీ నాయకత్వం నన్ను తీవ్రంగా గాయపరిచింది. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాను' అని ఆయన పేర్కొన్నారు. అలాగే బేలూరు ఎమ్మెల్యే గోపాలకృష్ణ కూడా రాజీనామా చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు, మైసూర్ నాయకుడు తన్వీర్ సేట్‌కు మంత్రివర్గంలో చోటు నిరాకరించడంతో, ఆయన మద్దతుదారుడొకరు మైసూరులో విషం తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డారు.

## ఎపి రైతులకు ప్రభుత్వం శుభవార్త

**ఖరీఫ్ పంటల బీమా గడువు పొడిగింపు**



అమరావతి: రైతులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. ఖరీఫ్ పంటల బీమా గడువును పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. ఖరీఫ్ పంటలకు బీమా నమోదు గడువును మరో 15 రోజులు పొడిగించినట్లు స్పష్టం చేసింది. జులై 31వ తేదీతో ముగియాల్సిన గడువుకు మరో 15 రోజులపాటు అవకాశం కల్పించినట్లు వెల్లడించింది. ప్రకృతి వైపరీత్యాలు, వరదలు, వర్షాభావం వల్ల పంట నష్టాలకు బీమా రక్షణ కల్పిస్తున్నట్లు ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసింది. రూ.1 ప్రీమియంతో అన్నదాతలకు పంటల బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు ఏపీ సర్కార్ వివరించింది. ఇప్పటికి కూడా నమోదు చేసుకోని రైతులు వెంటనే బీమా నమోదు చేసుకోవాలని సూచించింది. సాగు చేసిన ప్రతి ఎకరానికి బీమా నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేసింది. బ్యాంకులు, సీఎస్సీ కేంద్రాలు, రైతు సేవా కేంద్రాలు, ఔఅఎఖ మొబైల్ యాప్‌ల ద్వారా నమోదు చేసుకోవచ్చని ఏపీ ప్రభుత్వం పేర్కొంది.

## సాగునీటి ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులే లక్ష్యం

హైదరాబాద్: రాష్ట్ర సాగునీటి భవిష్యత్తుకు అత్యంత కీలకమైన నాలుగు ప్రధాన ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు సాధించే ప్రక్రియను ఇకపై కాలపరిమితితో కూడిన కార్యాచరణగా ముందుకు తీసుకెళ్లాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, సీతారామ సాగర్, డిండి, గౌరవెల్లి ప్రాజెక్టులను అత్యున్నత ప్రాధాన్య జాబితాలో ఉంచి, సాధ్యమైనంతవరకు ఆరు నెలల్లో ప్రాజెక్టులవారీగా పర్యావరణ అనుమతులు సాధించేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు. పర్యావరణ అనుమతుల ప్రక్రియకు సంబంధించి సుప్రీంకోర్టు ఇటీవల వెలువరించిన తీర్పు న్యాయపరమైన స్పష్టతను కల్పించడంతోపాటు రాష్ట్ర సాగునీటి ప్రాజెక్టుల అనుమతుల సాధనకు కొత్త అవకాశాల ద్వారాలను తెరిచిందని ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకొని కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖతోపాటు సంబంధిత చట్టబద్ధ సంస్థల వద్ద పెండింగ్‌లో ఉన్న ప్రతి అర్హమైన ప్రతిపాదనను వేగంగా ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. సాగునీటి ప్రాజెక్టుల పర్యావరణ అనుమతులు, న్యాయపరమైన అంశాలు, పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావంపై సోమవారం రోజున రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశానికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షత వహించారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ బలరాం నాయక్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. సుప్రీంకోర్టు తాజా తీర్పులో పేర్కొన్న అంశాలను ప్రస్తావించిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, గతంలో చట్టబద్ధంగా పర్యావరణ అనుమతులు పొందిన ప్రాజెక్టులకు ఆ రక్షణ కొనసాగుతుందని తెలిపారు. ఇప్పటికే పరిశీలనలో ఉన్న దరఖాస్తులను సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా పరిష్కరించే అవకాశం ఉందన్నారు. గతంలో తిరస్కరణకు గురైన ప్రతిపాదనలను ప్రాజెక్టులవారీగా సమగ్రంగా పరిశీలించి, సాంకేతిక, విధానపరమైన లోపాలను సరిదిద్దిన అనంతరం చట్టపరంగా అవకాశం ఉన్నచోట తిరిగి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాజెక్టుల పర్యావరణ అనుమతులపై సుదూర ప్రభావం చూపగల ఈ తీర్పు వెలువడటం వెనుక తెలంగాణ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు అనుమతులు సాధించేందుకు నిరంతరంగా సాగించిన న్యాయపోరాటం ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఈ తీర్పులోని న్యాయసూత్రాలను లోతుగా అధ్యయనం చేసి, రాష్ట్రంలోని ప్రతి ప్రాజెక్టుకు అవి ఏ విధంగా వర్తిస్తాయో ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. తెలంగాణ సాగునీటి ప్రయోజనాల పరిరక్షణలో అంతర్రాష్ట్ర విభాగం అత్యంత కీలకమని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు.

## నా విద్యార్హతలు...రుణాలు తెరిచిన కాగితం

ముంబై: బీజేపీ కార్యకర్త ఒకరు సమాచార హక్కు చట్టం ఆర్టీఐ ద్వారా తన విద్యార్హతల వివరాలను కోరడంపై కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్పందించారు. బీజేపీ నేతలు కూడా కూడా తమ విద్యకు సంబంధించిన డిగ్రీలను బహిరంగపరచాలని సవాల్ చేశారు. 'నా స్కాలర్‌షిప్ లేఖ, విద్యారుణ లేఖను వెల్లడించడానికి నేను సిద్ధంగా ఉన్నా. చక్రవర్తి తన డిగ్రీని చూపిస్తారా అని అభిజిత్ ప్రధాని మోదీ విద్యార్హతను ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా, బీజేపీ నాయకులు కూడా తమ విద్యార్హతలను బహిరంగపరుస్తారా? అని అభిజిత్ దీప్కే ప్రశ్నించారు. 'ఒక బీజేపీ కార్యకర్త నాపై ఆర్టీఐ దాఖలు చేసి, నా చదువు ఎలా పూర్తి చేశానో తెలుసుకోవాలనుకుంటున్నట్లు ఇప్పుడే చూశాను. మీ నాయకులు వారి డిగ్రీని చూపిస్తారా అని ఆయనను నేను అడగాలనుకుంటున్నా అని అన్నారు. మరోవైపు తన విద్యా నేపథ్యం ఎందుకు ఒక సమస్యగా మారింది? అని అభిజిత్ ప్రశ్నించారు. 'ఒక సాధారణ యువకుడు బోస్టన్ యూనివర్సిటీలో చదివితే వారికేం బాధ. విద్య పట్ల మీకెందుకంత వ్యతిరేకత? అని నిలదీశారు. బోస్టన్ యూనివర్సిటీ స్కాలర్‌షిప్, విద్యా రుణంతో తన చదువు కోసం ఆర్థిక సహాయం పొందినట్లు ఆయన వివరించారు. విద్యా రుణం తిరిగి చెల్లించాల్సి ఉందన్నారు. ప్రతి ఒక్కరూ దీనిపై విచారణ జరుపవచ్చని దీప్కే అన్నారు. నీట్ లీక్ వివాదంపై నిరసన ఉద్యమానికి నేతృత్వం వహించడానికి జూన్‌లో భారత్‌కు ఆయన తిరిగి వచ్చారు.

### కర్నాటక కాంగ్రెస్‌లో విస్తరణ చిచ్చు

బెంగళూరు:కర్ణాటక ముఖ్యమంత్రి డీ.కే. శివకుమార్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన మంత్రివర్గ విస్తరణ రాష్ట్ర కాంగ్రెస్‌లో చిచ్చు రేపింది. ఆగ్రహావేశాలు, ఆనందోత్సాహాలను చవిచూడాల్సి వచ్చింది. కొందరిలో విపరీతమైన ఆనందోత్సాహానికి, మరికొందరిలో తీవ్ర ఆగ్రహావేశాలకు కారణమైంది. ఏకంగా 20 మంది కొత్త మంత్రుల ప్రమాణస్వీకారంతో ఒకవైపు పండుగ వాతావరణం సంతరించుకోగా, మరోవైపు తీవ్ర అసమ్మతి, ధర్నాలు, ఆందోళనలకు దారితీసింది.

కేబినెట్‌లో చోటు దక్కకపోవడంతో అసమ్మతి నేతలు బహిరంగంగానే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి పదవి దక్కకపోవడంపై తీవ్ర మనస్థాపానికి గురైన ఎమ్మెల్యే యశ్వంతరాయ గౌడ పాటిల్ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. 'పార్టీ నాయకత్వం నన్ను తీవ్రంగా గాయపరిచింది. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాను' అని ఆయన పేర్కొన్నారు. అలాగే బేలూరు ఎమ్మెల్యే గోపాలకృష్ణ కూడా రాజీనామా చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు, మైసూర్ నాయకుడు తన్వీర్ సేట్‌కు మంత్రివర్గంలో చోటు నిరాకరించడంతో, ఆయన మద్దతుదారుడొకరు మైసూరులో విషం తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డారు. అతన్ని ప్రస్తుతం ఆసుపత్రికి తరలించగా, తన్వీర్ సేట్ నేరుగా వెళ్లి

పరామర్శించారు. ధార్వాడ్‌లో ప్రసాద్ అబ్బయ్య మద్దతుదారులు రహదారిపై టైర్లు కాల్చి, ప్రభుత్వ బస్సుపై రాళ్ళు రువ్వి ఆందోళన చేపట్టారు. అసమ్మతి నేతల రహస్య భేటీ: హెచ్‌కే పాటిల్, దినేష్ గుండూరావుతో సహా పదవులు దక్కని సీనియర్ నాయకులు బెంగళూరులోని పీ.వీ. జయచంద్ర నివాసంలో అత్యవసర రహస్య సమావేశం ఏర్పాటు చేసి తదుపరి కార్యాచరణపై చర్చిస్తున్నారు.

మంత్రి మునియప్ప అసంతృప్తి: మరోవైపు సీనియర్ నేత, కేబినెట్ మంత్రి కె.హెచ్. మునియప్ప కూడా తన శాఖ కేటాయింపుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, శాఖను మార్చాలని కోరుతున్నట్లు సమాచారం.

ప్రమాణస్వీకారానికి కొన్ని గంటల ముందు కేబినెట్ జాబితాలో నాటకీయ మార్పులు చోటుచేసుకున్నాయి. తొలుత ప్రకటించిన ముసాయిదా నుంచి మంకాల్ వైద్య, గాయత్రి చంద్రశేఖర్‌లను తొలగించి, ఆఖరి నిమిషంలో సీనియర్ నేత ఎస్.ఎస్. మల్లికార్జున్‌కు కేబినెట్‌లో స్థానం కల్పించారు. కర్ణాటక కాంగ్రెస్ విస్తరణపై బీజేపీ ఐటీ సెల్ చీఫ్ అమిత్ మాలవీయా తీవ్ర విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ చెబుతున్న సామాజిక న్యాయం, మహిళా సాధికారత మాటలకే పరిమితమని ఎద్దేవా చేశారు.

# మరింత పటిష్టంగా మీ సేవ కేంద్రాలు

### అత్యుత్తమ డిజిటల్ సేవలు అందించాలి

### ప్రపంచ బ్యాంక్ ఆసియా పసిఫిక్ ప్రాంతీయ డైరెక్టర్‌తో సిఎస్ భేటీ



హైదరాబాద్ రాష్ట్రంలో మీ సేవ కేంద్రాలను మరింత పటిష్టపరిచి ప్రజలకు అత్యుత్తమ డిజిటల్ సేవలు అందించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ప్రపంచ బ్యాంక్ గ్రూప్‌కు చెందిన డిజిటల్ ఆసియా పసిఫిక్ ప్రాంతీయ డైరెక్టర్ మహేష్ ఉత్తమ్‌చందానీ నేతృత్వంలోని ప్రతినిధుల బృందంతో ప్రధాన కార్యదర్శి సమావేశమయ్యారు. సమావేశంలో డిజిటల్ ఇండియా వికసిత్ భారత్?2047 లక్ష్యాల సాధనలో భాగంగా రాష్ట్రంలో మీ సేవ కేంద్రాల ఆధునీకరణ, భారత్ ఫ్యూచర్ సిటీలో కొత్త డేటా సెంటర్ల ఏర్పాటు కోసం మౌలిక సదుపాయాల కల్పన, కృత్రిమ మేధస్సు, సైబర్ భద్రత, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, యువతకు ఐటీ ఆధారిత ఉపాధి అవకాశాల విస్తరణ వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ గవర్నెన్స్ రంగంలో అమలు చేస్తున్న సంస్కరణలను ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు అభినందించారు. రాష్ట్రంలో డిజిటల్ సామర్థ్యాల పెంపు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాల వినియోగం, ప్రజా సేవల నాణ్యత మెరుగుదల, డేటా గవర్నెన్స్ వంటి రంగాల్లో ప్రపంచ బ్యాంక్ అందించగల సాంకేతిక సహకారం, జ్ఞాన భాగస్వామ్యం, అంతర్జాతీయ ఉత్తమ విధానాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

దేశంలో డిజిటల్ రంగంలో పెట్టుబడులకు హర్యానా, తెలంగాణ రాష్ట్రాలు అనుకూలంగా ఉన్నాయని పేర్కొన్న ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు, సుమారు రూ.2,000 కోట్ల పెట్టుబడుల కోసం సమగ్ర ప్రాజెక్టు నివేదికలు సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు. అనంతరం టి-÷బైర్ ప్రాజెక్టు పురోగతిపై ప్రధాన కార్యదర్శి ప్రత్యేక సమీక్ష నిర్వహించారు.

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ విస్తరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, సేవల విస్తరణ తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు.

టి-ఫైబర్ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు నాణ్యమైన డిజిటల్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల మధ్య సమన్వయంతో ప్రాజెక్టు అమలులో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించి, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దూరిశెట్టి, ప్రపంచ బ్యాంక్ డిజిటల్?ఆసియా పసిఫిక్ ప్రాంతీయ డైరెక్టర్ మహేష్ ఉత్తమ్‌చందానీ, టి-ఫైబర్ ఎం.డి., సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరులో నూతన పార్కు ప్రారంభం

### రూ.39 లక్షలతో బంగ్లాతోట పార్కు, ఏసీ మినీ కమ్యూనిటీ హాల్ అభివృద్ధి.. ప్రారంభించిన మంత్రి నారాయణ

నెల్లూరు, ఆగస్టు 2 : నెల్లూరు నగరంలోని 9వ డివిజన్ నవాబ్‌పేటలో ఆధునికీకరించిన బంగ్లాతోట పార్కు, ఏసీ మినీ కమ్యూనిటీ హాల్‌ను రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ ఆదివారం ప్రారంభించారు. రూ.39 లక్షల వ్యయంతో ఈ అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన వినోద, సామాజిక వసతులు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. నగరంలో ప్రతిపాదించిన 47 పార్కుల్లో ఇప్పటికే 40 పార్కులను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వెల్లడించారు. పార్కులతో పాటు కుటుంబ, సామాజిక కార్యక్రమాల నిర్వహణకు తక్కువ ఖర్చుతో ఉపయోగపడే ఏసీ మినీ కమ్యూనిటీ హాళ్లను కూడా అందుబాటులోకి తీసుకువస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉ ంచుకుని ఈ వసతులను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. నెల్లూరు నగరంలో భూగర్భ డ్రైనేజీ (యూజీడీ) పనులను కూడా వేగవంతంగా కొనసాగిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. పరిశుభ్రమైన, దోమల సమస్య లేని, వరదలను తట్టుకునే మౌలిక వసతులతో కూడిన నగరంగా నెల్లూరును తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని మంత్రి పేర్కొన్నారు. నగరాభివృద్ధిలో ప్రజల సహకారం కూడా అవసరమని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు. అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసి ప్రజలకు మరిన్ని సౌకర్యాలు అందించేందుకు చర్యలు కొనసాగుతాయని మంత్రి తెలిపారు.

# ఇంటింటికీ టీడీపీకి విశేష స్పందన

### ఏడో రోజుకు చేరిన 'ఇంటింటికీ టీడీపీ' కార్యక్రమం

### 17.61 లక్షల ఇళ్లను సందర్శించిన కూటమి శ్రేణులు

### ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరించిన నాయకులు

### పురోగతిపై సమీక్ష నిర్వహించిన పార్టీ నాయకత్వం

అమరావతి, ఆగస్టు 2 : అధికార కూటమిలోని తెలుగుదేశం పార్టీ చేపట్టిన 'ఇంటింటికీ టీడీపీ -- రెండు ఏళ్ల నమ్మకం, అభివృద్ధి--సంక్షేమం' కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా కొనసాగుతోంది. ఏడో రోజైన ఆదివారం కూడా ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించినట్లు పార్టీ నాయకత్వం తెలిపింది.



కార్యక్రమం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 17,61,197 ఇళ్లను సందర్శించి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించినట్లు వెల్లడించింది.

ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొన్నారు. ఒక్కరోజే రాష్ట్రవ్యాప్తంగా 3,01,197 ఇళ్లను సందర్శించినట్లు పార్టీ పేర్కొంది. రైతు సంక్షేమం, మహిళా సాధికారత, యువతకు ఉపాధి అవకాశాలు, మౌలిక వసతుల అభివృద్ధి, పారదర్శక పాలన వంటి అంశాల్లో ప్రభుత్వం సాధించిన పురోగతిని ప్రజలకు వివరించినట్లు తెలిపింది.దవివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు అందిన ప్రయోజనాలను గణాంకాలతో సహా ప్రజలకు వివరిస్తున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజల అభిప్రాయాలను కూడా తెలుసుకుంటూ, వారి సూచనలను నమోదు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై పూర్తి అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. కార్యక్రమ పురోగతిపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆదివారం జిల్లా అధ్యక్షులు, పార్లమెంట్ అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి ఇంటికి చేరుకుని ప్రభుత్వ విజయాలను సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు. సెలవు రోజు కూడా కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలను అభినందిస్తూ ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా కార్యక్రమాన్ని నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు పార్టీ తెలిపింది. నియోజకవర్గాల వారీగా పురోగతిని సమీక్షిస్తూ అవసరమైన సూచనలు చేస్తున్నారని వెల్లడించింది. ప్రజల నుంచి వస్తున్న సానుకూల స్పందన ప్రభుత్వంపై ఉన్న విశ్వాసానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నట్లు పార్టీ వివరించింది. ప్రతి ఇంటికీ చేరుకుని ప్రభుత్వ పనితీరు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని పార్టీ శ్రేణులకు నారా లోకేశ్ పిలుపునిచ్చినట్లు పేర్కొంది. ప్రభుత్వం, ప్రజల మధ్య వారధిగా ఈ కార్యక్రమం కొనసాగుతోందని, రాష్ట్రవ్యాప్తంగా ఇదే ఉత్సాహంతో ముందుకు తీసుకెళ్తామని టీడీపీ నాయకత్వం వెల్లడించింది.



# అవయవ దానంపై అవగాహన పెంచాలి

### విశాఖలో అవయవ దాన అవగాహన సదస్సులో మంత్రి సత్యకుమార్ యాదవ్

విశాఖపట్నం, ఆగస్టు 2 : విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన అవయవ దాన అవగాహన సదస్సులో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అవయవ దానం ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు. మంత్రి మాట్లాడుతూ, అవయవ దానం మహోన్నతమైన మానవతా సేవ అని పేర్కొన్నారు. ఒక అవయవ దాత ఏకంగా ఎనిమిది మంది జీవితాల్లో వెలుగులు నింపగలడని, సమాజంలోని ప్రతి ఒక్కరూ అవయవ దానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ అంశంపై విస్తృతంగా అవగాహన పెంచాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 5,900 మంది అవయవ మార్పిడి కోసం ఎదురుచూస్తున్నారని మంత్రి తెలిపారు. 2025లో 93 మంది దాతల ద్వారా 301 అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించగా, 2026లో ఇప్పటివరకు 57 మంది దాతల ద్వారా 180 మందికి పునర్జన్మ లభించిందని వెల్లడించారు.

అవయవ మార్పిడి సేవలను మరింత విస్తరించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ కేంద్రాల సంఖ్యను 3 నుంచి 9కు పెంచి, మరింత మందికి నాణ్యమైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అవయవ దానం ద్వారా అనేక కుటుంబాల్లో కొత్త ఆశలు చిగురిస్తాయని మంత్రి అన్నారు. ఈ గొప్ప సేవలో యువత, స్వచ్ఛంద సంస్థలు, వైద్యులు, సామాజిక సంస్థలు చురుకుగా పాల్గొని ప్రజల్లో అవగాహన పెంచాలని కోరారు. ఈ సదస్సులో వైద్య నిపుణులు, అవయవ దాన సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అవయవ దానంపై ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు ప్రభుత్వం మరిన్ని కార్యక్రమాలు చేపడుతుందని మంత్రి తెలిపారు.

## పెన్షన్ల పంపిణీలో మంత్రి నారాయణ

నెల్లూరు, ఆగస్టు 2 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి): నెల్లూరు నగరంలోని 4వ డివిజన్ దీనదయాళ్ నగర్‌లో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆదివారం ఇంటింటికీ వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులను కలిసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజా సంక్షేమంతో పాటు ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. దీనదయాళ్ నగర్‌లో పెండింగ్‌లో ఉన్న రహదారి పనులను వేగవంతం చేసి, రెండు నెలల్లో ఎండ్-టు-ఎండ్ రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమాజంలోని ప్రతి వర్గానికి గౌరవప్రదమైన జీవనం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. మానవతా దృక్పథంతో ట్రాన్స్‌జెండర్ సోదరసోదరీమణులకు ఇళ్లను కేటాయించడం ప్రభుత్వం సామాజిక న్యాయానికి ఇస్తున్న ప్రాధాన్యానికి నిదర్శనమని అన్నారు. ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా అర్హులైన ప్రతి లబ్ధిదారుకు సంక్షేమ ఫలాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. పేదలు, వృద్ధులు, దివ్యాంగులు, ఇతర అర్హుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు.



# సహజీవనం కూడా చట్టబద్ధమైన జీవితమే

### భాగస్వామిని వేధింపులకు గురి చేస్తే చట్టప్రకారం శిక్ష సుప్రీం ధర్మాసనం సంచలన తీర్పు

న్యూఢిల్లీ: సహజీవనం అంశంపై భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది. సహజీవనంలో భాగస్వామిని వేధింపులకు గురి చేస్తే భారతీయ శిక్షాస్మృతి లోని సెక్షన్ 498-ఏ ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయవచ్చని స్పష్టం చేసింది. పెళ్లి కాలేదనే కారణంతో భర్త స్థానంలో ఉన్న వ్యక్తి వేధింపుల ఆరోపణల నుంచి తప్పించుకోలేరని పేర్కొంది. వివాహం జరగలేదన్న కారణాన్ని చూపి బాధితురాలికి చట్టపరమైన రక్షణ కల్పించకపోవడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14కు విరుద్ధమని తెలిపింది. ఈ మేరకు జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించింది. ఈ సందర్భంగా భర్త అనే పదానికి ధర్మాసనం విస్తృత వివరణను ఇచ్చింది. సహజీవన చేస్తున్న వ్యక్తిని భర్తతో సమానంగా పరిగణించవచ్చని తెలిపింది. ఇలాంటి వ్యక్తులు భాగస్వామిని వేధించి తప్పించుకోలేరని ధర్మాసనం పేర్కొంది. అయితే, అన్ని రకాల సహజీవనాలకు ఈ తీర్పు వర్తించదని స్పష్టం చేసింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి సహజీవనం చేస్తూ హింసకు పాల్పడిన వారికే సెక్షన్ 498-ఏ వర్తిస్తుందని వెల్లడించింది. అలాగే, ప్రాథమిక విచారణ నిర్వహించకుండా తక్షణ అరెస్టులు చేయవద్దని పోలీసులకు కఠిన ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా సెక్షన్ 498-ఏ ఉద్దేశాన్ని ధర్మాసనం వివరించింది. ఈ సెక్షన్ మహిళలను భర్త లేదా అతని కుటుంబ సభ్యుల మానసిక, శారీరక వేధింపుల నుంచి రక్షించడానికే అని గుర్తు చేసింది. అలాంటి వేధింపులు కేవలం చట్టబద్ధమైన వివాహ బంధంలోనే జరుగుతాయని భావించడం వాస్తవాలకు విరుద్ధమని వ్యాఖ్యానించింది. వివాహిత మహిళకు ఒక రకమైన రక్షణ కల్పించి, అదే తరహా సంబంధంలో ఉన్న మరో మహిళకు రక్షణ నిరాకరించడం సహేతుకం కాదని ధర్మాసనం అభిప్రాయ పడింది. వ్యక్తిగత స్వేచ్ఛలో భాగంగా జీవిత భాగస్వామిని ఎంచుకునే హక్కును చట్టం గుర్తించిందని ధర్మాసనం తెలిపింది. ఆ విధంగా భాగస్వామిని ఎంచుకున్న మహిళకు చట్టపరమైన రక్షణను నిరాకరించలేమని పేర్కొంది. సహజీవనం చేస్తున్న మహిళకు తన భాగస్వామి లేదా అతని కుటుంబ సభ్యుల నుంచి వేధింపులు ఎదురైతే ఆమెకు కూడా సమాన చట్టపరమైన రక్షణ కల్పించాల్సిందేనని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది.

# ప్రధాని మోడీపై మైనర్ బాలిక వ్యాఖ్యల కేసు

### క్షమించానని..కేసులతో వేదించమని ప్రధాని హామీ

### కేసును వెనక్క తీసుకున్నట్లు ఢిల్లీ పోలీసు ప్రకటన

న్యూఢిల్లీ,ఆగస్ట్3(ఆర్ఎన్ఎ): నీట్ పేపర్ లీక్ ఆందోళనల్లో భాగంగా ప్రధాని మోదీపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన మైనర్ బాలికపై కేసును కొనసాగించబోమని దిల్లీ పోలీసు వర్గాలు స్పష్టం చేశాయి. ఈ ఘటనకు సంబంధించి నోయిడా పోలీసులు ఇటీవల జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి దిల్లీలోని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ఆమె వ్యాఖ్యలు ప్రధాని పదవిని అగౌరవపర్చేలా, శాంతియుత పరిస్థితులకు భంగం కలిగించేలా ఉన్నాయంటూ అందిన ఫిర్యాదు ఆధారంగా ఈ కేసు నమోదైంది. అయితే, ప్రస్తుతం ఆ కేసును బాలికపై కొనసాగించడం లేదని పోలీసులు వెల్లడించారు. తన కుమార్తెపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో పోలీసులు వయసు 25 ఏళ్లుగా నమోదు చేశారని.. కానీ, ఆమె వయసు 15 ఏళ్లే అని తన తల్లి చెప్పిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఈ క్రమంలోనే బాలిక తల్లి తప్పు తెలుసుకుని ప్రధాని మోదీకి క్షమాపణలు చెప్పిన విషయం తెలిసిందే. తన కుమార్తెను క్షమించి గొప్ప మనసు చాటుకున్నారని ఆమె ప్రధానిని కొనియాడారు. 18 ఏళ్లలోపు పిల్లలకు ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాలను నిషేధించాలని ఆమె సూచించారు. చిన్నారులకు తెలియక సులభంగా ఇతరుల ప్రభావానికి లోనయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. వారి దృష్టి చదువులపైనే ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జంతర్‌మంతర్ నిరసనల సందర్భంగా ప్రధానిని ఉద్దేశించి అసభ్యపదజాలంతో మాట్లాడిన బాలికపై కేసు పెట్టవద్దని ఢిల్లీ పోలీసులు నిర్ణయించినట్టు జాతీయ మీడియాలో కూడా కథనాలు వెలువడ్డాయి. ఈ ఉదంతానికి సంబంధించి తొలుత నోయిడా పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ ఫైల్ చేసిన విషయం తెలిసిందే. ఆ తరువాత ఢిల్లీ పోలీసులు ఈ ఉదంతంపై దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో బాలిక ప్రధానికి క్షమాపణ చెబుతూ వీడియో రిలీజ్ చేసింది. తనకు 15 ఏళ్లేనని, నిరసన వద్ద ఇతరుల ప్రభావానికి లోనై అలాంటి వ్యాఖ్యలు చేశానని వివరణ ఇచ్చుకుంది. ఇది తన చివరి తప్పిదమని కూడా చెప్పింది. ఈ క్రమంలో ప్రధాని మోదీ కూడా సోషల్ మీడియా వేదికగా స్పందించారు. తప్పుదారి పట్టిన పిల్లలను క్షమించాలని అభిప్రాయపడ్డారు. వారిని శిక్షించడం, కోర్టుల చుట్టూ తిప్పడం వల్ల ప్రయోజనం ఉండదని అన్నారు. బాలిక తల్లి కూడా ఈ ఉదంతంపై స్పందించారు. తన కుమార్తెను క్షమించిన ప్రధాని ఆమెకు జీవనదానం చేశారని అన్నారు. బాలికపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాలని కూడా విజ్ఞప్తి చేశారు. సోషల్ మీడియా వాడకుండా మైనర్లపై నిషేధం ఉండాలని కూడా అభిప్రాయపడ్డారు.

అయితే తన కుమార్తెను ప్రధాని క్షమించినా పోలీసులు ఇంకా ఎఫ్ఐఆర్‌ను వెనక్కు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బాలిక చేసిన తప్పునకు పశ్చాత్తాపడుతోందని చెప్పారు. తప్పుదారి పట్టిన చిన్నారులను క్షమించాలని, సక్రమమార్గంలో నడిపించాలని ప్రధాని చెప్పినా పోలీసులు ఇంకా ఎఫ్ఐఆర్ వెనక్కు తీసుకోలేదని అన్నారు. పెద్దల విషయంలో తన కూతురు అసభ్య పదజాలం వాడి ఉండాల్సింది కాదని అన్నారు. నిరసన తెలిపేందుకు, వివిధ వేదికల్లో తమ అభిప్రాయాలను వినిపించేందుకు యువతకు హక్కు ఉన్నప్పటికీ అసభ్య భాష మాత్రం వాడకూడదని బాలిక తల్లి అభిప్రాయపడ్డారు. పుట్టిన రోజుకోసం దుస్తులు కొనుక్కుంటానని జులై 23న తన కుమార్తె బయటకు వెళ్లిందని చెప్పారు. ఆమె వైరల్ వీడియోను బంధువులు పంపించాకే ఈ విషయం తమకు తెలిసిందని చెప్పారు. 'ఘటన గురించి వెలుగులోకి వచ్చాక మేము ముఖం దాచుకుని బయటకు వెళ్లాల్సి వస్తోంది. గతంలో ఉన్న ప్రాంతం నుంచి మేము మరో చోటకు మారిపోయాము. తరచూ మకాం మార్చాల్సి వస్తోంది. బాలిక మైనర్ అని ఇప్పటికే నిర్ధారణ అయ్యింది. కానీ ఆమెపై ఎఫ్ఐఆర్ మాత్రం ఇంకా వెనక్కు తీసుకోలేదు' అని బాలిక తల్లి తెలిపారు. బాలిక కూడా క్షమాపణ చెప్పిన విషయాన్ని పేర్కొన్నారు. 'ప్రధాని స్వయంగా ఆమెను క్షమించినప్పుడు పోలీసులు కూడా కేసు క్లోజ్ చేసి ఎఫ్ఐఆర్‌ను వెనక్కు

# భారత్ ప్రతినిధి
తెలుగు దిన పత్రిక

# గుంటూరు వార్తలు
మంగళవారం, 04 ఆగష్టు 2026


# 'అవయవదానం' అంటే మరో జీవితానికి పునర్జన్మ ఇవ్వడమే

### ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు, 03 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి :** అవయవదానం అంటే మరో జీవితానికి పునర్జన్మ ఇవ్వడమేనని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. సోమవారం గుంటూరులో జాతీయ అవయవ దాన దినోత్సవం సందర్భంగా సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ అండ్ చారిట బుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సామాజిక సంస్థల ప్రతినిధులు, బ్రహ్మకుమారీస్ సభ్యులు, అవయవదానంపై అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అవయవదానం కోసం ముందుకు వచ్చే ప్రతి వ్యక్తి నిజమైన ముఖ్య అతిథి అని, వేదికపై కూర్చున్నవారు కాదు సమాజానికి జీవదానం చేసే వారే ప్రత్యేక అతిథులని గళ్ళా మాధవి పేర్కొన్నారు. మనిషి చిరకాలం సమాజంలో నిలిచిపోవాలంటే రెండు మార్గాలే ఉన్నాయని, ఒకటి సమాజానికి అందించే సేవ, రెండోది అవయవదానం అనిఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. ఈ రెండు రూపాల్లో మనిషి ఎప్పటికీ ప్రజల మదిలో జీవిస్తాడని పేర్కొన్నారు. అవయవదానం కేవలం ఒక వ్యక్తికి సంబంధించిన విషయం కాదని, అది ఒక కుటుంబాన్ని, ఒక సమాజాన్ని ప్రభావితం చేసే మహోన్నతమైన మానవతా కార్యక్రమమని వివరించారు. సావిత్రిబాయి పూలే వంటి మహనీయులు తమ జీవితాలను సమాజం కోసం అంకితం చేశారని, వారి సేవల ఫలితంగానే నేడు లక్షలాది మంది విద్యను అభ్యసించే అవకాశం పొందుతున్నారని చెప్పారు. సమాజంలో మనం పొందుతున్న ప్రతి సౌకర్యం వెనుక ఎవరో ఒకరి త్యాగం, కృషి, ఆలోచన, సేవ దాగి ఉంటుందని అన్నారు. సరిహద్దుల్లో దేశాన్ని కాపాడే సైనికుడి నుంచి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే కార్మికుడి వరకు ప్రతి ఒక్కరూ సమాజానికి తమ వంతు సేవ చేస్తున్నారని గురుచేశారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, మీరు దేశ భవిష్యత్తు అని, యువత ఆలోచనలే రేపటి భారతదేశ దిశను నిర్ణయిస్తాయన్నారు. సమాజంలో మార్పు తీసుకు రావాల్సిన బాధ్యత యువత పై ఉందని, అవయవదానం వంటి మానవతా కార్యక్రమాలపై అవగాహన పెంచి మరింత మందిని ప్రేరేపించాలని కోరారు. ఒక సైనికుడు అనేక మంది ప్రాణాలను కాపాడినట్లే, ఒక అవయవదాత మరణానంతరం ఎనిమిది మందికి వరకు కొత్త జీవితం అందించగలడని ఎమ్మెల్యే తెలిపారు. అందుకే అవయవదానం చేసిన వ్యక్తులకు ప్రభుత్వం గౌరవప్రదమైన లాంఛనాలతో వీడ్కోలు పలికే విధానాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. అవయవదానం ద్వారా ఒక వ్యక్తి జీవితాంతం మరొకరిలో జీవిస్తూనే ఉంటాడని అన్నారు. అన్నదానం ఒక రోజు ఆకలి తీర్చగలదని, విద్యాదానం భవిష్యత్తును నిర్మించగలదని, రక్తదానం ఒక ప్రాణాన్ని కాపాడగలదని, కానీ అవయవదానం ఒక మనిషికి పూర్తిగా కొత్త జీవితం ప్రసాదిస్తుందని చెప్పారు. అందుకే ఇది అత్యున్నత దానంగా గుర్తింపు పొందిందని పేర్కొన్నారు.

ప్రస్తుతం సమాజంలో అవయవదానంపై నమోదు శాతం ఇంకా చాలా తక్కువగా ఉందని, దీనిని పెంచాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే అన్నారు. మరణానంతర అవయవదానం గురించి ఇప్పటికీ సమాజంలో కొన్ని అపోహలు, భయాలు ఉన్నాయని, వాటిని అధిగమించేందుకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఆధునిక ఆలోచనలతో ముందుకు సాగుతున్న యువత ఈ మార్పుకు నాయకత్వం వహించాలని కోరారు. అవయవదానం పట్ల మహిళలు, యువత ముందంజలో ఉండటం అభినందనీయమని, ఈ అవగాహనను మరింత విస్తరించి ప్రతి కళాశాల, ప్రతి యువకుడి వద్దకు తీసుకెళ్లాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. సమాజానికి బాధ్యతాయుత పౌరులుగా ఎదగడంతో పాటు మరణానంతరం కూడా మానవాళికి ఉపయోగపడే నిర్ణయాలు తీసుకోవాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి విద్యార్థులకు సూచించారు.

# గుంటూరు ఛానల్ విస్తరణకు మూడో విడత పరిహారం విడుదల

### పెమ్మసాని చొరవతో రైతుల ఖాతాల్లోకి రూ.10 కోట్లు జమ



**గుంటూరు, 03 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి :** గుంటూరు ఛానల్ విస్తరణ పనుల్లో భాగంగా భూములు ఇచ్చిన రైతులకు పరిహారం చెల్లింపుల ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ప్రత్యేక చొరవతో రాష్ట్ర ప్రభుత్వం పరిహారపు నిధుల మూడో విడతను విడుదల చేసింది. గుంటూరు ఛానల్ ఎక్స్‌టెన్షన్ కోసం భూములు ఇచ్చిన జిజి పాలెం, రావిపాడు గ్రామాలకు చెందిన 37 మంది రైతుల ఖాతాల్లో మూడో విడతగా రూ.10 కోట్ల పరిహారం జమ అయింది. ఇప్పటికే తొలి విడతగా రూ.10.54 కోట్లు, రెండో విడతగా రూ.17.58 కోట్లు కలిపి రూ.28.12 కోట్లను రైతులకు ప్రభుత్వం చెల్లించింది. తాజాగా విడుదల చేసిన రూ.10 కోట్లతో కలిపి ఇప్పటివరకు మొత్తం రూ.38.12 కోట్ల పరిహారం రైతుల ఖాతాల్లో జమ అయింది. గుంటూరు ఛానల్ విస్తరణకు సంబంధించి రైతులకు చెల్లించాల్సిన మొత్తం పరిహారం రూ.70.17లు కాగా, ఇప్పటివరకు రూ.38.12 కోట్లు చెల్లించడంతో దాదాపు 54 శాతం పరిహారం చెల్లింపులు పూర్తయ్యాయి. ఇంకా చెల్లించాల్సిన సుమారు రూ.32.05 కోట్ల పరిహారాన్ని కూడా త్వరలోనే పూర్తిగా రైతులకు అందేలా చర్యలు తీసుకుంటామని డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.

**రైతుకు పరిహారం. ఛానల్ విస్తరణకు వేగం :**

గుంటూరు ఛానల్ విస్తరణకు అవసరమైన భూసేకరణలో రైతులను సమన్వయం చేయడంతో పాటు, భూములు ఇచ్చిన రైతులకు సకాలంలో పరిహారం అందేలా డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. రైతుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిహారం చెల్లింపులు వేగంగా జరిగేలా చర్యలు చేపడుతున్నారు.

గుంటూరు ఛానల్ విస్తరణ పూర్తయితే ఈ ప్రాంతంలో సాగునీటి సదుపాయాలు మరింత మెరుగుపడి, వ్యవసాయానికి గణనీయమైన ప్రయోజనం చేకూరనుంది. అభివృద్ధి ప్రాజెక్టుల అమలుతో పాటు భూములు ఇచ్చిన రైతుల ప్రయోజనాలను పరిరక్షించడానికీ కూటమి ప్రభుత్వం సమాన ప్రాధాన్యత ఇస్తోంది. రైతుల సమస్యలను సానుకూలంగా పరిశీలించి, పరిహారం చెల్లింపులను వేగవంతం చేస్తూ వారికి న్యాయం జరిగేలా సహకరిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు చెల్లించాల్సిన మిగిలిన పరిహారాన్ని కూడా త్వరితగతిన పూర్తిచేసి, గుంటూరు ఛానల్ విస్తరణ పనులను వేగంగా ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు.

# గుంటూరు తూర్పులో ఉత్సాహంగా మన ఇంటికి -మన నసీర్



**గుంటూరు, 03 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి :** గుంటూరు తూర్పు నియోజకవర్గంలో రెండేళ్ల పాలన-ఇంటింటి ప్రచారం పండుగలా సాగుతోంది. సోమవారం స్థానిక 54వ వార్డుల రాజీవ్ గాంధీ నగర్ లో మన ఇంటికి-మన నసీర్ కార్యక్రమాన్ని ఈస్ట్ నియోజకవర్గ అబ్జర్వర్ ఈశ్వర్ తో కలిసి ఎమ్మెల్యే నసీర్ ఘనంగా నిర్వహించారు. తొలుత తమ ఎమ్మెల్యే వచ్చారని ప్రజలు ఘన స్వాగతం పలికారు. గత ఐదేళ్లలో కనీసం రోడ్లకు కూడా నోచుకోని తమ ప్రాంతానికి అభివృద్ధి ఫలాలు తీసుకొచ్చారని సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే నసీర్ ప్రతి ఇంటికీ వెళ్లి కూటమి పాలన ప్రగతి గురించి వివరించారు. ఇప్పటి వరకు కూటమి ప్రభుత్వం అందించిన సంక్షేమ ఫలాల గురించి అడిగి తెలుసుకున్నారు. తల్లికి వందనం డబ్బుల పడ్డాయా ? పిల్లలు చక్కగా చదువుకుంటున్నారా ? ఇంకా విద్యార్థులకు ఎలాంటి సౌకర్యాలు కల్పించాలి వంటి అంశాలపై ఆరా తీశారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో గత ఐదేళ్లలో కనీసం రోడ్లు కూడా నిర్మించ లేదన్నారు. ఏ ప్రాంతానికి వెళ్లినా సర్రున జారే రోడ్లు కనిపించేవని, తట్ట మట్టి కూడా వేయలేదని విమర్శించారు. రాష్ట్రంలో అమరావతి పునర్నిర్మాణం చేపట్టామని, పోలవరం పనులపురోగతి సాధించామని తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో మెగా డీఎస్సీ ద్వారా 16,437 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేశామన్నారు. రెండేళ్ల కాలంలో ఇచ్చిన హామీలలో అత్యధిక శాతం నెరవేర్చామని, సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. అన్న క్యాంటీన్లలో పేదలకు కడుపు నిండా భోజనం పెడుతున్నామని చెప్పారు. పేదల పక్షాల నిలిచే ప్రభుత్వం తమదని చెప్పారు. గుంటూరు నగరాన్ని కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చేస్తున్నామని, విద్య, వైద్య రంగాల్లో పురోగతి సాధించామని తెలిపారు. బొంగరాల బీడు ప్రాంతంలో కార్మిక శాఖ స్థలాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ స్థలంపై కన్నేశారని, తాము వాకింగ్ ట్రాక్, జీజీహెచ్ అనుబంధంగా ఆస్పత్రి భవన నిర్మాణాలు చేపడుతున్నామని తెలిపారు. ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టిన రోజుల్లోనే కాకుండా ప్రతినిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్నామని, నియోజకవర్గ ప్రజలకు ఏ అవసరం వచ్చినా ఒక్క పిలుపు దూరంలో ఉంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో గోళ్ల ప్రభాకర్, ఆనంద్, ముప్పవరపు భారతి, కృష్ణ, చిట్టం సింధు, గుంటి నరసింహారావు, ప్రసన్నకుమార్, బాబు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# జీర్ణకోశ మహమ్మారి పై 'యశోద' ఆధునిక అస్త్రం!

### యశోద హాస్పిటల్స్ లో రోబోటిక్ సర్జరీలతో మెరుగైన క్యాన్సర్ చికిత్సలు
### ఎంఆర్ లినక్ (MR Linac) సాంకేతికతతో అత్యంత కచ్చితమైన రేడియేషన్
### ప్రాథమిక దశలో వ్యాధిని గుర్తిస్తే ప్రాణాపాయం నుంచి నూరు శాతం విముక్తి
### మారుతున్న జీవనశైలి, చెడు వ్యసనాలతోనే పొంచి ఉన్న గ్యాస్ట్రో ముప్పు
### గుంటూరు విలేకరుల సమావేశంలో ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ వెంకటేష్ శ్రీపతి వెల్లడి




**గుంటూరు, 03 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి :** మారుతున్న జీవనశైలి, ఆధునిక ఆహారపు అలవాట్లు మానవ శరీరంలోని అత్యంత కీలకమైన జీర్ణకోశ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో గ్యాస్ట్రో సంబంధిత వ్యాధులు, క్యాన్సర్ల బారి నుంచి రోగులను కాపాడేందుకు ఆధునిక వైద్య సాంకేతికత సంజీవనిలా మారుతోందని యశోదహాస్పిటల్స్ ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ వెంకటేష్ శ్రీపతి స్పష్టం చేశారు. సోమవారం గుంటూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన జీర్ణకోశ వ్యాధులపై సమగ్ర సమాచారాన్ని పంచుకున్నారు. అత్యంత సంక్లిష్టమైన గ్యాస్ట్రో శస్త్రచికిత్సలను అలవోకగా ఛేదించి వేలాది మంది రోగులకు పునర్జన్మ ప్రసాదించిన డాక్టర్ వెంకటేష్ శ్రీపతి, తనఅపార అనుభవంతో జాతీయ స్థాయిలో అగ్రగామి సర్జన్‌గా విశేష గుర్తింపు పొందారు. ఎలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న రోగికైనా అత్యాధునిక పద్ధతుల్లో చికిత్స అందించి ప్రాణాలు నిలపడంలో ఆయనది అందెవేసిన చేయి. ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో సరైన వేళకు ఆహారం తీసుకోకపోవడం, ధూమపానం, మద్యపానం, ఊబకాయం, మధుమేహం తదితర కారణాల వల్ల కాలేయం, ప్యాంక్రియాస్, అన్నవాహిక, జీర్ణాశయం, పెద్దపేగు తదితర అవయవాలు తీవ్ర వ్యాధుల బారిన పడుతున్నాయని డాక్టర్ వెంకటేష్ శ్రీపతి ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా కడుపులో నొప్పి, ఆహారం మింగేటప్పుడు ఇబ్బందిగా అనిపించడం, ఆకలి మందగించడం, అకారణంగా బరువు తగ్గడం, మలంలో రక్తం పడటం వంటి లక్షణాలను సాధారణ సమస్యలుగా భావించి ఏమాత్రం నిర్లక్ష్యం చేయరాదని హెచ్చరించారు. ఈ తరహా లక్షణాలు కనిపించిన వెంటనే నిపుణులైన వైద్యులను సంప్రదించి అవసరమైన పరీక్షలు చేయించుకోవడం ద్వారా పెను ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు. వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే పూర్తిస్థాయిలో నయం చేసే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని, ప్రజలు క్రమంతప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని హితవు పలికారు. క్లిష్టమైన గ్యాస్ట్రో సమస్యలు, క్యాన్సర్లకు యశోద హాస్పిటల్స్ వేదికగా ఎండోస్కోపీ, కొలొనోస్కోపీ, ఎండోస్కోపిక్ అల్ట్రాసౌండ్, ఈఆర్సీపీ, లాపరో స్కోపిక్, రోబోటిక్ శస్త్రచికిత్సల ద్వారా అత్యుత్తమ వైద్యాన్ని అందిస్తున్నట్లు డాక్టర్ వెంకటేష్ వెల్లడించారు. ముఖ్యంగా గ్యాస్ట్రో క్యాన్సర్ల చికిత్సలో మాగ్నెటిక్ రెసోనెన్స్ లీనియర్ యాక్సిలరేటర్ (ఎంఆర్ లినక్) సాంకేతికత విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందని వివరించారు. ఈ అత్యాధునిక విధానంలో ప్రతిరోజూ ఎంఆర్ఐ చిత్రాల ఆధారంగా కాలేయం, ప్యాం క్రియాస్, అన్నవాహిక, రెక్టమ్ ప్రాంతాల్లోని క్యాన్సర్ కణితులను కచ్చితత్వంతో గుర్తించి రేడియేషన్ అందిస్తారని, దీనివల్ల చుట్టుపక్కల ఉండే ఆరోగ్యకరమైన కణాలకు ఎలాంటి నష్టం వాటిల్లదని స్పష్టం చేశారు. దుష్ప్రభావాలులేని ఈవిధానం ద్వారా క్యాన్సర్ చికిత్సలో అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చని తెలి పారు. అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, 24 గంటల అత్యవసర సేవలు, ఇంటర్వెన్షనల్ రేడియాలజీ విభాగాలతో పాటు సర్జి కల్, మెడికల్, రేడియేషన్ ఆంకాలజీ నిపుణుల సమ న్వయంతో ఒకే గొడుగు కింద రోగ నిర్ధారణ నుంచి శస్త్రచికిత్స, కీమోథెరపీ, రేడియేషన్ థెరపీ, పునరావాసం వరకు సమగ్ర వైద్య సేవలు అందించడం యశోద హాస్పిటల్స్ సొంతమని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ మార్కెటింగ్ హెడ్ వీరంకి వెంకటేశ్వర రావు, గుంటూరు ఏరియా అసిస్టెంట్ మార్కెటింగ్ మేనేజర్ తిమోతి పాల్గొన్నారు. సమావేశం అనం తరం విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు డాక్టర్ వెంకటేష్ ఓపికగా సమాధానాలు ఇచ్చారు.




# రాజధాని ప్రాంత రైతుల ప్రయోజనాలే పరమావధి

### మంత్రి పొంగూరు నారాయణ

**గుంటూరు, 03 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి :** సోమవారం కలెక్టరేట్లోని శంకరన్ హాల్లో తాడికొండ శాసనసభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్, జిల్లా కలెక్టర్ సాయి కాంత్ వర్మ, సిఆర్డిఏ అడిషనల్ కమిషనర్ భార్గవ తేజ తదితరులతో కలిసి తాడికొండ, మోతడక, కంతేరు గ్రామ రైతులతో మంత్రి నారాయణ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రైల్వే లైను, ఇన్నర్ రింగ్ రోడ్డు ప్రాజెక్టులకు అవసరమైన భూమి సమీకరణ గురించి రైతులతో విపులంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ, రైతుల ప్రయోజనాలను కాపాడుతూనే ప్రాజెక్టులను చేపడుతున్నామన్నారు. తాడికొండ, మోతడక గ్రామాల రైతులు ల్యాండ్ పూలింగ్ కు ముందుకు వచ్చారన్నారు. కంతేరు గ్రామ రైతులు మరొకసారి గ్రామ రైతులతో మాట్లాడి తెలియజేస్తామని అన్నారని వివరించారు. అదేవిధంగా రైతులు కోరిన విధంగా ల్యాండ్ పూలింగ్ నకు కాలవ్యవధి నిర్ణయిస్తామన్నారు. అంతిమంగా రాజధాని ప్రాంత రైతులకు మేలు చేయాలనే లక్ష్యంతోనే కృషి చేస్తున్నామన్నారు. ఈ సమావేశం లో మూడు గ్రామాల రైతులతో పాటు సి ఆర్ డి ఏ అడిషనల్ కమిషనర్ కార్తీక్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డిఆర్ఓ ఖాజావలి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఆయుష్ ఆసుపత్రికి స్థల పరిశీలన చేసిన కలెక్టర్



**గుంటూరు, 03 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి :** ఆయుష్ ఆసుపత్రి, అనుబంధ సంస్థలు ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ సోమవారం స్థల పరిశీలన చేశారు. ప్రత్తిపాడు మండలం నడింపాలెం గ్రామ పరిధిలో స్థల పరిశీలన జరిగింది. గుంటూరు పట్టణానికి అతి సమీపంలో ఆయుష్ ఆసుపత్రి, అనుబంధ సంస్థలు రావడం వలన ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుంది. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, తహసిల్దార్ వెంకటేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

# గుంటూరు లో ఘనంగా పింగళి వెంకయ్య జయంతి కార్యక్రమం




**గుంటూరు, 03 ఆగస్టు 2026, భారత్ ప్రతినిధి :** స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై నటనాలయ అధ్యక్షుడు నీలం మందారావు ఆధ్వర్యంలో సోమవారం జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. తొలుత పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా జరిగిన సభకు డాక్టర్ పట్టాభి కళా పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ తూములూరి రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించారు.ఆథితులుగా మాజీ ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు,ఆలయ కమిటీ అధ్యక్షులు సిహెచ్ మస్తానయ్య,రాష్ట్ర రెడ్ క్రాస్ సొసైటీ ఉపాధ్యక్షులు పి. రామచంద్ర రాజు,విజ్డమ్ వాటర్ వర్క్స్ అధినేత కాళశీగి వంశీకృష్ణ, గుంటూరు అన్నదాన సమాజం ఈవో జి.శ్రీనివాసరావు, రంగస్థలం నటుడు కొల్లూరి శివప్రసాద్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.సభానంతరం శ్రీమతి జ్యోతి సరళ స్మారక కళాపరిషత్ విశాఖపట్నం వారు ఆకెళ్ళ రచనకు,కొండవలస లక్ష్మణరావు దర్శకత్వం వహించిన,పి సి హెచ్ నాయుడు నిర్వహణలో ప్రదర్శించిన రేపటి శత్రువు నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది.

# సెప్టెంబర్ 2న ఏ ఎన్ యు స్వర్ణోత్సవాలు



**గుంటూరు, 03 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి :** ఆచార్య నాగార్జున విశ్వవిద్యా లయం స్వర్ణోత్సవాలు సెప్టెంబర్ 2న జరుగునున్నాయి. ఈ సందర్భంగా శాఖల వారీగా అలూమ్ని సమావేశాలు, గ్రాండ్ యూనివర్సిటీ అలూమ్ని మీట్ నిర్వహించనుంది. ఈ మేరకు విశిష్ట పూర్వ విద్యార్థి పురస్కారాలను ప్రదానం చేయనున్నామని రిజిస్ట్రార్ సింహాచలం తెలిపారు. సోమవారం సంబంధిత బ్రోచర్లను విడుదల చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పూర్వ విద్యార్థులందరూ ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

## 400వ రోజుకి చేరుకున్న జెకేఆర్ నిరసన దీక్ష



**నిడుముక్కల, 03 ఆగస్టు 2026, భారత్ ప్రతినిధి :** రాజధాని రైతులకు న్యాయం చేయాలంటూ చేపట్టిన రిలే నిరసన దీక్ష 400వ రోజుకు చేరుకుంది.ఈ సందర్భంగా ఏఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపకులు జంజనం కోటేశ్వరరావు మాట్లాడుతూ, రైతు పోలింగ్ అంశంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని, లేకపోతే ప్రజల్లో ప్రభుత్వానికి ఆదరణ తగ్గే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. రాజధాని రైతులకు న్యాయం జరిగే వరకు తాను అండగా నిలిచి పోరాటం కొనసాగిస్తానని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి రాజధాని అంశంపై తన నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని, అలా చేస్తే రానున్న ఎన్నికల్లో ప్రజల నుంచి మంచి ఆదరణ లభించే అవకాశం ఉంటుందని వ్యాఖ్యానించారు. తాను ఏ రాజకీయ పార్టీకి వ్యతిరేకం కాదని, రాజధాని రైతులకు న్యాయం చేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో ఏఆర్ఎస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని జంజనం కోటేశ్వరరావు ఆశాభావం వ్యక్తం చేశారు.


## ప్రజలకు నిత్యవసర వస్తువులను నాణ్యతతో పాటు పారదర్శకంగా తక్కువ రేట్లకు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

విజయవాడ ఏఎంసీ చైర్మన్ నర్రా వాసు
ఇబ్రహీంపట్నం రైతు బజార్లో సన్నబియ్యం విక్రయ దుకాణం ప్రారంభం



**ఇబ్రహీంపట్నం, 03 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి :** ప్రజలకు నాణ్యమైన సన్నబియ్యాన్ని అందుబాటు ధరల్లో అందించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన నూతన సన్న బియ్యం విక్రయ దుకాణాన్ని ఇబ్రహీంపట్నం రైతు బజార్లో విజయవాడ ఏఎంసీ చైర్మన్ నర్రా వాసు ప్రారంభించారు. సోమవారం ఇబ్రహీంపట్నం రైతు బజార్ లో జరిగిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతు బజార్ల ద్వారా ప్రజలకు నిత్యవసర వస్తువులను నాణ్యతతో పారదర్శకంగా తక్కువ రేట్లకు అందించటమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఈ ప్రాంత పరిధిలోని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ సేవలను వినియోగించు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చెరుకుపల్లి రాధిక, మార్కెట్ డైరెక్టర్ బసవ ఉమామహేశ్వరరావు, కొండపల్లి మున్సిపాలిటీ వైస్‌చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాసరావు, క్లస్టర్-09 ఇన్చార్జ్ చనుమోలు నారాయణ, ఇబ్రహీంపట్నం ది కోపరేటివ్ సొసైటీ చైర్మన్ కోయ నెహ్రూ మరియు కూటమి పార్టీల నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ధర్మ ప్రచార పరిషత్ (ఎస్-ఎస్ఎఫ్) మండల సమావేశాలు : పొన్నపల్లి సత్యనారాయణ



**రేపల్లె / చెరుకుపల్లి, 03 ఆగస్టు 2026, భారత్ ప్రతినిధి :** రేపల్లె సబ్ డివిజన్ పరిధిలోని రేపల్లె మండలం గుడికాయ లంక శ్రీ అంకదేవర ఆలయంలోనూ, చెరుకుపల్లి మండలం పిట్టుపాలెం శ్రీ కోదండ రామాలయంలోనూ సోమవారం మండల ధార్మిక సమావేశాలు వైభవంగా నిర్వహించారు. రేపల్లె మండల కన్వీనర్ పేరం కోటేశ్వరరావు, చెరుకుపల్లి కమిటీ సభ్యులు పి. కోటేశ్వర్ రెడ్డిల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాలకు జిల్లా కన్వీనర్ ముఖ్య వక్తగా హాజరై ప్రసంగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ధార్మిక జట్ల ద్వారా దేవాలయాల వద్ద ప్రతి నెలా సత్సంగాలు, సామూహిక హారతులు, వారం వారం భజనలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆలయాల వద్ద జాతీయ పతాకావిష్కరణ, వరలక్ష్మీ వ్రతం, అలాగే ఈ నెల 28 నుండి సెప్టెంబర్ 6 వరకు ప్రతి పల్లెలో రక్షాబంధన్ కార్యక్రమాలను దిగ్విజయంగా పూర్తిచేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ధర్మ పరిరక్షణకు, పరధర్మంలోకి వెళ్లిన బంధువులను గుర్తించి తిరిగి స్వధర్మంలోకి ఆహ్వానించడానికి ప్రతి ఒక్కరూ క్రియాశీలకంగా పనిచేయాలని, నిత్య దైవస్మరణతో కుటుంబ శ్రేయస్సు సిద్ధిస్తుందని స్పష్టం చేశారు. అనంతరం రేపల్లెలో పలువురు కార్యకర్తల గృహ సంపర్క కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశాల్లో సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ మురళీకృష్ణ, గ్రామ కన్వీనర్లు, మహిళలు మరియు ధార్మిక ప్రముఖులు విశేషంగా పాల్గొన్నారు.

# నిండు ప్రాణం తీసిన రాఘవేంద్ర ప్రజా వైద్యశాల


వైద్యుడి నిర్లక్ష్యం కారణంగా ఓ నిండు ప్రాణం బలి
అనుమతులేని ఆసుపత్రిలో వైద్యం
45 రోజులు గడిచిన తర్వాత బాధితులపైనే ఫిర్యాదు చేసిన వైద్యుడు




**ఇబ్రహీంపట్నం, 03 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి :** ఇబ్రహీంపట్నం ఓ వైద్యశాల నిండు ప్రాణం తీసివేసిందంటూ బాధితులు ఆరోపిస్తున్నారు. కొండపల్లి కి చెందిన ఓ వ్యక్తి గ్యాస్ నొప్పితో ఆస్పత్రికి తన వాహనంపై చేరుకోగా డాక్టర్ లేని సమయంలో ఓ కాంపౌండర్ డాక్టర్లకు ఫోన్ చేసి సలహాల మేరకు వైద్యం అందించాడు. గ్యాస్ నొప్పితో వచ్చిన వ్యక్తికి గుండె కు సంబంధించిన ఇంజక్షన్ చేయటం వలన ప్రాణం పోయిందంటూ బాధితులు వాపోతున్నారు. చనిపోయిన తరువాత ఆ వ్యక్తికి సిపిఆర్ చేశారంటూ చనిపోయే ముందు ఈసీజీ తీశామంటూ. ఈసీజీలో గుండె కు సంబంధించి ప్రాబ్లం ఉండటంతో ఇంజక్షన్ చేశామంటూ ఒకసారి.. చేయలేదంటూ మరొకసారి డాక్టర్లు బొంగుతున్నారని వాపోయారు.. ఇంటిదగ్గర గ్యాస్ నొప్పితో బయలుదేరిన వ్యక్తి ఆసుపత్రికి వచ్చిన తర్వాత కూడా వైద్యం అందించాక ఆసుపత్రిలోనే బాత్రూంకి వెళ్లివచ్చి ఒక్కసారిగా కుప్పకూలిపోయారంటూ బాధితులు తెలిపారు. అయితే కుప్పకూలిన వ్యక్తికి వైద్యం అందించి కొద్ది నిమిషాలలోనే చనిపోయారు తీసుకు వెళ్ళమంటూ చెప్పటంతో కుటుంబసభ్యులు మృతదేహాన్ని అక్కడ నుండి ఇంటికి తీసుకువెళ్లారు. నాలుగు రోజులు గడిచిన తర్వాత చనిపోయిన వ్యక్తి భార్య జ్వరంతో బాధపడుతూ ఉండగా అదే ఆసుపత్రికి చేరుకొని వైద్యం చేయించుకున్నాక, చివరిసారి మా వారు తిరిగిన ప్రదేశం ఇదే కాబట్టి ఒకసారి వీడియో చూపిస్తే చూసుకుంటాను అని డాక్టర్లను కాళ్లపై పడి అడగగా దానికి డాక్టర్లు కంప్యూటర్ గురించి నాకు తెలియదు. రేపు సీసీ కెమెరా టెక్నీషియన్ ను పిలిపిస్తానని నీకు ఆ సిసి ఫుటేజ్ వీడియో అందిస్తానని తెలిపి పంపించేశారు. మరోసారి ఆసుపత్రికి వెళ్లి అడగక ఇదిగో రేపు అంటూ మరోసారి వెళితే మరోసారి అంటూ వారిని తిప్పించారు. దీంతో వారికి అనుమానం వచ్చి నా భర్తకు సంబంధించిన డెత్ సర్టిఫికేట్ కావాలని కోరగా డెత్ సర్టిఫికెట్ కోసం ఇదిగో ఈరోజు రేపు అంటూ కాలం గడిపారు. తీరా మరోసారి వెళ్లి అడగక పంచాయతీ ఆఫీసులో ఉంది తీసుకోమని చెప్పగా బాధితులు మరణ ధ్రువీకరణ పత్రం కోసం పంచాయతీ ఆఫీస్ కు చేరుకోగా ఆసుపత్రి పేరు ఇక్కడ లేదని, మీరు డాక్టర్లే సంప్రదించాలని బాధితులకు తెలపగా మరలచేసేదిలేక ఆసుపత్రికి చేరుకొని డాక్టర్‌నుకోరారు. అప్పుడే అసలువిషయం బయటకు వచ్చింది ఆసుపత్రికి ఎటువంటి అనుమతులు లేకుండా ఆసుపత్రిని నడుపుతున్నారని, ఆస్పత్రి అనుమతి కోసం అప్పుడే డబ్బులు చెల్లించి అనుమతి పొందుతున్నారని, అందువల్లనే మరణ దివీకరణ పత్రంరావటం ఆలస్యం అవుతుందని తెలిసిందన్నారు. అసలు అనుమతి లేకుండా నాభర్తకు ఏవైద్యం చేశారు. ఎందుకు చంపారు అంటూ బాధితులు డాక్టర్లను నిలదీశారు. చనిపోయిన నాలుగు రోజుల నుండి ఆసుపత్రి చుట్టూ తిరుగుతూ సర్టిఫికెట్ అడుగుతున్న ఇవ్వకపోవడంతో పలు అనుమానాలు దారి తీసాయి. సర్టిఫికెట్ లో కూడా డాక్టర్ ఆలోచన లేకుండా సర్టిఫికెట్ ఇచ్చిన విధానం చూస్తే అర్థమవుతుం దని అంటున్నారు. 10:45 ఆస్పత్రికి వచ్చారు.10:46 అడ్రినాలిన్ ఇంజెక్షన్ ఇంజక్షన్ చేశాను తీసుకువెళ్లిపొమ్మని చెప్పారు.10:55 నుండి స్పృహ లేకుండా ఉన్నారని, 11:23 చనిపోయారని సర్టిఫికెట్లో రాయడంతో మాకుపలు అనుమానాలు కలుగుతున్నాయని, సిసి ఫుటేజ్ ను పలుమార్లు కావాలని కోరినప్పటికీ 45 రోజులు గడిచిన తర్వాత మా మీదే పోలీస్ ఫిర్యాదు చేశారంటూ బాధితులు వాపోయారు. ఇన్ని రోజులు నమ్మకంగా నమ్మించి సిసి ఫుటేజ్ ఇస్తానని మాయమాటలు చెప్పి ఆసుపత్రికి వచ్చాక ఆస్పత్రి సిబ్బంది మరియు మరికొంతమంది మమ్మల్ని రౌండ్ అప్ చేశారు. దీంతో మేము ఇబ్రహీంపట్నం పోలీసులను ఆశ్రయించాము. మా కన్నా ముందుగానే వారి మనుషుల్లో ఒకరు పోలీస్ స్టేషన్ కి చేరుకొని మా మీద ఫిర్యాదు చేయడంపై నా భర్త చావుకి కారణం వైద్యుడు నిర్లక్ష్య కారణమని అర్థమవుతుందని దీని వెనుక ఎవరెవరు ఉన్నారు. నాభర్తకు ఎటువంటి వైద్యం అందించారు. అనేది సిసి ఫుటేజ్ బయటకు తీస్తే అర్థమవుతుందని, తమకు న్యాయం జరిగే వరకు పోరాడతానని, ఇలాంటి అనుమతులు లేకుండా ఆసుపత్రి నడుపుతున్న వారిపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, నాకు జరిగినట్లుగా ఏ ఒక్కరికి అన్యాయం జరగకూడదని, బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. దీనిపై సంబంధిత ఇబ్రహీంపట్నం సీఐ సుబ్రహ్మణ్యం స్పందించి బాధితులకు న్యాయం చేస్తానని హామీఇచ్చారు. సీఐబాధితులతో మాట్లాడినవిధానంపై న్యాయం చేకూరుతుందని నమ్మకంతో ఎదురుచూస్తున్నామని బాధితులు తెలిపారు.

# స్మశాన వాటిక అభివృద్ధి చేయండి మహాప్రభు

మూడు కిలోమీటర్ల నుండి చనిపోతే స్మశాన వాటికకు తీసుకురావాలంటే నానా ఇబ్బందులు
స్మశాన వాటికను కూడా వదలకుండా కబ్జా చేస్తున్న కబ్జాదారులు
ఎక్కడెక్కడ నుండో చనిపోయిన వారిని తీసుకువచ్చి ఇక్కడ దహన సంస్కారాలు చేస్తున్నారు.
స్థానికులకు కేటాయించిన స్మశాన వాటిక ఇప్పుడు అన్యాక్రాంతం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.





**ఇబ్రహీంపట్నం, 03 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి :** వెస్ట్ ఇబ్రహీంపట్నం లో నిమ్రా కాలేజీ సమీపంలో ఉన్నటువంటి ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన స్మశాన వాటిక అభివృద్ధి నోచుకోవటం లేదని ఆవేదన చెందుతున్నారు. స్మశాన వాటిక అభివృద్ధికి వచ్చిన నిధులు ఏమయ్యాయి అంటూ ప్రశ్నిస్తున్నారు. ఎక్కడకక్కడ స్మశాన వాటికల అభివృద్ధి పేరుతో వచ్చిన నిధులను ఏమవుతున్నాయని ప్రశ్నిస్తున్నారు. ఇబ్రహీంపట్నం నిమ్రా కాలేజీకి సమీపంలో ఉన్న ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన స్మశాన వాటికకు సంబంధించి అభివృద్ధి చేయండి అంటూ ఎన్నో సార్లు స్థానిక ఎమ్మెల్యే నాయకుల చుట్టూ తిరిగిన పట్టించుకోవడంలేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క ఎక్కడినుండో చనిపోయిన వ్యక్తులను తీసుకువచ్చి ఇక్కడ దహన సంస్కారాలు చేస్తున్నారని, దీనివల్ల స్మశాన వాటికలోకి వెళ్లేందుకు కూడా అవకాశం లేకుండా పోయిందని అంటున్నారు. రాజ సామాజిక వర్గానికి చెందిన స్మశాన వాటికను ఆనుకొని ఉన్నటువంటి వారు స్మశాన వాటికను కూడా కబ్జా చేసి ఇల్లు నిర్మిస్తున్నారని, దీనివల్ల భవిష్యత్తులో స్మశానవాటిక కనుమరుగ వుతుందని వాపోతున్నారు. స్మశాన వాటికను పట్టించుకోకపోవడంతో పిచ్చి మొక్కలు మొలిచి అసంఘి కార్యక్రమాలకు నిలయంగా మారిందని ఆవేదన చెందుతున్నారు. మరోపక్క సరైన రోడ్లు లేకపోవడంతో చనిపోయిన వ్యక్తిని తీసుకు రావాలంటే ఎక్కడ పడిపోతావ్ ఏమోనని భయంతో ఇక్కడకు వస్తున్నాం అంటున్నారు. మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న వారికి ఇక్కడ స్మశాన వాటిక కల్పించడంపై చనిపోతే ఆ మనిషిని దహన సంస్కారాలు చేయాలంటే ఇబ్బందులు పడక తప్పడం లేదంటున్నారు. మరో పక్క విటీపీఎస్ నుండి వెలువడే బూడిద వలన ఇక్కడ స్మశాన వాటికలో రెండు అడుగులు గొయ్యి తీయగానే బూడిద నీరు ఊరుతుందని, నీరు తోడి పాతిపెట్టిన మరసటి రోజు ఆ బాడీ బయటకు వస్తుందని, ఇన్ని ఇబ్బందులు పడుతున్న ఎవరు పట్టించుకోవడంలేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎస్సీ సామాజిక వర్గానికి ఎంత స్థలం కేటాయించారు.. ఎక్కడ వరకు కేటాయించారు... ఇక్కడకు ఎక్కడో చనిపోయిన వారిని తీసుకువచ్చి దహన సంస్కారాలు చేస్తున్న వారిపై కూడా దృష్టి సారించాలని.. స్మశాన వాటికను అభివృద్ధి చేయాలంటూ గ్రామస్తులు కోరుతున్నారు.

## తక్కువ ధరకే నాణ్యత గల బియ్యం పంపిణీ : అనగాని శివప్రసాద్



**చెరుకుపల్లి, 03 ఆగస్టు 2026, భారత్ ప్రతినిధి :** సామాన్య ప్రజలకు మేలైన ప్రయోజనాలు కల్పించడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం అమ్మకం కేంద్రాలను ప్రారంభించిందని రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు అనగాని శివప్రసాద్ తెలిపారు. సోమవారం చెరుకుపల్లి మండల రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యదర్శి గ్రంధి సుబ్బారావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన ప్రత్యేక విక్రయ కేంద్రాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా ఆర్డీవో శ్రీదేవి మాట్లాడుతూ, రూ. 62 విలువై బిపిటి స్టీమ్ బియ్యాన్ని రూ. 52లకే, రూ. 58 విలువైన రా బిపిటి బియ్యాన్ని రూ. 50లకే కౌంటర్ల ద్వారా విక్రయిస్తున్నామని, ప్రతి రేషన్ కార్డుకు నెలకు 10 కిలోల చొప్పున అందిస్తున్నట్లు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 115 రైతు బజార్లు, 500 రైస్ మిల్లర్ల కేంద్రాల ద్వారా ఈ సౌకర్యం అందుబాటులో ఉంచామని, ప్రజలందరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలని అనగాని శివప్రసాద్ కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సురేష్ కుమార్, వీఆర్వో నాగరాజు, స్థానిక నాయకులు ఎం.ఆర్.కె. మూర్తి, కుమారస్వామి, రామకృష్ణ, రాంబాబు, వివిధ సంఘాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల్లో శరవేగంగా అభివృద్ధి : అనగాని శివప్రసాద్



**చెరుకుపల్లి, 03 ఆగస్టు 2026, భారత్ ప్రతినిధి :** గత ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో చేయలేని అభివృద్ధిని రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కేవలం రెండేళ్లలోనే సాధించి చూపించిందని రాష్ట్ర రెవిన్యూ, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన చెరుకుపల్లిలోని కొత్తపేటలో నిర్వహించిన టిడిపి 'డోర్ టు డోర్' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఇంటింటికీ తిరుగుతూ స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కరపత్రాలను అందజేస్తూ, ఒకవైపు రాజధాని నిర్మాణంతోపాటు మరోవైపు గ్రామాలను కూడా శరవేగంగా అభివృద్ధి చేసే దిశగా కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎంఆర్‌కే మూర్తి, మల్లాది రామకృష్ణ, పూషడుపు కుమారస్వామి, దివి రాంబాబు, సొంటి సుబ్బయ్య, దివి శ్రీనివాసరావు, కావూరి శ్రీను, సనకా శ్రీనివాసరావు, కొట్రా ప్రసాదు, నాగులు పున్నారావు, కొమ్మూరి రాధాకృష్ణమూర్తి తదితర నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక మహిళలు పాల్గొన్నారు.

# ప్రముఖ న్యాయవాది సీ. హెచ్. వెంకటేశ్వరరావు మృతి

**గుంటూరు, 03 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి :** సెంట్రల్ ఎక్సైజ్, కస్టమ్స్, సర్వీస్ ట్యాక్స్, సేల్ ట్యాక్స్, జీఎస్టీ, ఏ.సి.బి, సీ.బి. ఐ కేసులకు సంబంధించి కన్సల్టెంట్ గా, న్యాయవాది గా, ఎ.పి హైకోర్టు ట్రాన్సలేటర్ పలు సేవలు అందించిన చివుకుల వెంకటేశ్వరరావు ఆదివారం రాత్రి గుంటూరు బ్రాడీపేట లోని తన స్వగృహంలో వయోభారంతో కన్నుమూసారు. ఆయన వయసు 93 సంవత్సరాలు. వెంకటేశ్వరరావు పూర్వం గుర్రం మీద తిరుగుతూ ఉండటంతో ఆయనకు గుర్రాల వెంకటే శ్వరరావు అనే పేరు ఏర్పడింది. తన వద్దకు వచ్చే క్లయింట్ కు గొప్ప మనో ధైర్యం ఇచ్చే వారు ఆయన. తొంబై వయసు వచ్చే వరకు కూడా ఆయన ఎంతో ఉత్సహకంగానే తన వృత్తి లో కొనసాగారు. కేసుల నిమిత్తం ఢిల్లీ, చెన్నై, బెంగళూరు వంటి పెద్ద నగరాలకు ఎంతో ఓపికతో ప్రయాణం చేసేవారు. వెంకటేశ్వరరావు చేసిన సేవలకు ఇటీవల ఆయనను సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి ప్రశంసాపత్రం, జ్ఞాపికతో సత్కరించారు. వెంకటేశ్వరరావు మృతి పట్ల ఎ. పి సెంట్రల్ ఎక్సైజ్, కస్టమ్స్ పెన్షనర్స్ అసోసియేషన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. సంఘ నేతలు టి. వివేకానంద, పి.వి. సత్యనారాయణ, గుమ్మడి సీతారామయ్య చౌదరి, పి. కోటేశ్వరరావు, ఎన్. ఎస్. నగేష్ బాబు తదితరులు వెంకటేశ్వరరావు భౌతికకాయాన్ని దర్శించి ఘన నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.





# సబ్సిడీ ధరలకే నాణ్యమైన బియ్యం

సబ్సిడీ రైస్ కేంద్రాన్ని ప్రారంభించిన కాకినాడ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, జాయింట్ కలెక్టర్ అపూర్వ భారత్





**కాకినాడ బ్యూరో, 03 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి :** సామాన్య మధ్యతరగతి కుటుంబాలకు నాణ్యమైన బియ్యం అందించాలనే ఆశయంతో కూటమి ప్రభుత్వం ప్రతి రైతు బజార్ కేంద్రాల నందు తక్కువ ధరలకే స్టీమ్,రా బియ్యం అందించడం జరుగుతుందని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు. సోమవారం రైతు బజార్ ఆర్టీసీ కాంప్లెక్స్ నందు సబ్సిడీ రైస్ కేంద్రాన్ని శాసనసభ్యులు వనమాడి కొండబాబు, జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ చేతుల మీదుగా ప్రారంభించారు.ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ సామాన్య, మధ్యతరగతి ప్రజలకు తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం అందించాలనే ఆశయంతో బహిరంగ మార్కెట్లో రూ.62 ఉన్న స్టీమ్డ్ బియ్యాన్ని కేవలం రూ.52కే, రూ.58 ఉన్నరా బియ్యాన్ని రూ. 50కే రైస్ సబ్సిడీ కేంద్రాల ద్వారా అందించడం జరుగు తుందని, ప్రజల ఆర్థిక భారాన్ని తగ్గించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రతి రైస్ కార్డు కుటుంబానికి నెలకు 26 కిలోల వరకు కొనుగోలు అవకాశం ఉన్నదని, ఒకేసారి గరిష్టంగా 10 కిలోలు కొనుగోలు చేయవచ్చని, మూడు దఫాల్లో నెలకు ఒక కార్డు ద్వారా 26 కిలోల వరకు తీసుకునే వెసులుబాటు అందించడం జరిగిందని, నేటి నుండి రైస్ మిల్లర్ అవుట్లెట్ల ద్వారా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే నాణ్యమైన సూపర్ ఫైన్, స్టీమ్ బియ్యం అమ్మకాలు జరపడం జరుగుతుందిని పేర్కొన్నారు. అనంతరం రైతుబజారులో కూరగాయల విక్రయ కేంద్రాలను పరిశీలించి, ధరలు మరియు మార్కెటింగ్ కార్యకలాపాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో లలిత రైస్ ఇండస్ట్రీస్ అధినేత మట్టే శ్రీనివాస్, ఎమ్మార్వో జితేంద్ర, నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, సివిల్ సప్లై డైరెక్టర్ ఎనిమిరెడ్డి మాలకొండయ్య, మార్కెట్ కమిటీ ఛైర్మన్ బచ్చు శేఖర్, గదుల సాయిబాబా, బడేటి దేవి, పోలిపల్లి జగన్, వీరంరెడ్డి వెంకటలక్ష్మి శ్రీనివాస్, గంజి గోపి, బత్తుల భవాని, పులపకూర శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదుల పట్ల అధికారులు బాధ్యతతో పరిష్కరించాలి

పీజీఆర్ఎస్ కు 352 అర్జీలు

జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంద్ర ప్రసాద్




**కాకినాడ బ్యూరో, 03 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన ఫిర్యాదుల పట్ల అధికారులు అత్యంత బాధ్యతాయుతంగా స్పందించి, అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులనుఆదేశించారు. జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో జరిగింది. ఈ కార్యక్రమం లో జిల్లాకలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, జిల్లా సంయుక్త కలెక్టర్ అపూర్వ భరత్, ట్రైనీ కలెక్టర్ ప్రియ, డి ఆర్ ఓ డా.తిప్పేనాయక్, లతో పాటు జిల్లా పరిషత్ సీఈఓ లక్ష్మణ రావు, డ్వామా పిడి మధుసూదన్, జిల్లా స్వర్ణ గ్రామ, వార్డు అధికారి జె.వేణుగోపాల్, డీడీఓ పి.వాసుదేవర రావు, బీసీ కార్పొరేషన్ ఈడీ ఏ.శ్రీనివాస రావు, తదితరులు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ క్లినిక్ కు -30 అర్జీలు జిల్లా కలెక్టరేట్ లో జరిగిన రెవిన్యూ క్లినిక్ లో భాగంగా జిల్లా రెవెన్యూ అధికారి డా. తిప్పే నాయక్ ప్రజల నుంచి రెవిన్యూ సమస్యల మీద అర్జీలు స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం,సమగ్ర మైన విచారాణ చేపట్టి తగిన పరిష్కారం అందించాలని ఆయా శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు, కలెక్టరేట్ సెక్షన్ల అధిపతులు పాల్గొన్నారు.

# సామాన్యులకు తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం



నాణ్యమైన బియ్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం : రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ



**కాకినాడ బ్యూరో, 03 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి :** సామాన్య ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని అందుబాటు ధరల్లో అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర సీఎం చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పైలట్ ప్రాజెక్టులో భాగంగా కాకినాడ రూరల్ మండలం తూరంగి రైతు బజారులో ఏర్పాటు చేసిన ప్రత్యేక బియ్యం విక్రయ కేంద్రాన్ని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో సామాన్య కుటుంబాలకు అందుబాటు ధరలో రైతు బజార్లలో నాణ్యమైన సన్న బియ్యం, రారైస్ అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లాను ఎంపిక చేసి, స్థానిక రైస్ మిల్లర్లతో సమన్వయం చేసుకుంటూ రైతు బజార్లు,రైస్ మిల్లర్ స్టోర్ల ద్వారా బియ్యం విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమం ద్వారా మధ్యతరగతి, పేద కుటుంబాలకు నాణ్యమైన బియ్యం సరసమైన ధరలకు లభిస్తుందని, కుటుంబాల పై ఆర్థిక భారం తగ్గుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ భరత్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, తెలుగుదేశం పార్టీ కాకినాడ రూరల్ ఇంచార్జ్ పిల్లి అనంత లక్ష్మి సత్యనారాయణ కూటమి నాయకులు పెంకే శ్రీనివాస్ బాబా, చప్పిడి వెంకటేశ్వర రావు, రంభాల వెంకటేశ్వర రావు, వై మాలకొండయ్య, నూరుకుర్తి వెంకటేశ్వర రావు, కడలి ఈశ్వరి, శిరంగు శ్రీనివాస్, వల్లూరి రాజా, స్థానిక కూటమి నాయకులు, రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ స్థాయి నాయకులు, అధికారులు, రైస్ మిలర్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ట్రయల్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించిన కాకినాడ జిల్లా పోలీసులు

మరో కీలక కేసులో నిందితులకు శిక్ష





**కాకినాడ బ్యూరో, 03 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి :** కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఆదేశాల మేరకు ట్రయల్ కేసుల పై ప్రత్యేక దృష్టి సారించి సమర్థవంతంగా వాదనలు వినిపించడం ద్వారా మరో కీలక కేసులో నిందితులకు శిక్ష పడింది. డా. ఎం.కిషోర్ కుమార్, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్), ఇంచార్జ్ కాకినాడ సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ పర్యవేక్షణలో సర్పవరం పోలీస్ స్టేషన్ క్రైమ్ నెం. 387/2024 సెక్షన్ 103(1) దీఛీూ (302 ఖూజ) (ఎస్.సి. నెం. 69/2025) కేసులో న్యాయస్థానం నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష మరియు రూ. 5000/- రూపాయలు జరిమానా విధించడమైనది. ఒడిశా రాష్ట్రంనకు చెందిన మిల్లు స్వాయిన్, అతని భార్య రితాంజలి తమ మూడు సంవత్సరాల కుమారుడితో ఉపాధి నిమిత్తం కాకినాడ జిల్లా, కాకినాడ రూరల్, సర్పవరం గ్రామం శివారు భావనారాయణపురం, పోస్టల్ కాలనీ నందు ఇల్లు అద్దెకుతీసుకుని కాపురం ఉంటున్నట్లు, భర్త మిల్లు స్వాయిన్, ఆటోనగర్ లో గల ప్లాస్టిక్ కంపెనీ యందు కూలి పని చేయుచు ప్రతిరోజు మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యను కొట్టడం,తిట్టడం,అనుమానించడం చేసేవాడని, ది. 16/7/2024 వ తేదీ ముందు మూడు రోజుల నుంచి మిల్లు స్వాయిన్, పనికి వెళ్లకుండా మద్యంతాగి తన భార్యను కొడుతున్నట్లు, బంధువులు సర్దిచెప్పి, కాపురం చేసుకోమని చెప్పినట్లు, తరువాత మధ్యాహ్నం 12-00 గంటలకు పిర్యాది అయిన లిపి బిసోయ్ మృతిరాలికి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చినట్లు, అంతట ఆమె తన బావను మృతిరాలి ఇంటికి పంపగా, మృతిరాలు తన ఇంటిలోని బెడ్ రూమ్‌లో రక్తపు మడుగులో చనిపోయి వున్నట్లు, భర్త మిల్లు స్వాయిన్ తన భార్యను అనుమానంతో ఆమె తలను గోడకేసి కొట్టినట్లు ఫిర్యాదు లిపి బిసోయి, w/o జితేంద్ర బిసయై. ఖైరపుట్టి గ్రామం, గంగాపూర్ మండలం, గంజం జిల్లా, ఒడిస్స రాష్ట్రము ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి సర్పవరం పోలీసు స్టేషన్ సబ్-ఇన్‌స్పెక్టర్ బి. అజయ్ బాబు కేసు నమోదు చేయగా, సర్పవరం పోలీసు స్టేషన్ ఇన్స్పెక్టర్లు వై ఆర్ కె శ్రీనివాస్ ,బి.పెద్దిరాజు దర్యాప్తు చేపట్టి నిందితుడు మిల్లు స్వాయిన్, ం/0 అకులి స్వాయిన్, 31 సం., కుల్లంగి గ్రామం, గంగాపూర్ మండలం, గంజం జిల్లా, ఒడిస్స రాష్ట్రము అనువానిని అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించారు. అనంతరం చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసును నాలుగవ జిల్లా కోర్ట్ కాకినాడ మెజిస్ట్రేట్ శ్రీమతి కె. నాగమణి విచారించి, నిందితుడు పై అభియోగాలు ఋజువయ్యాయని నిర్ధారిస్తూ నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష మరియు రూ. 5000/- రూపాయలు జరిమానా విధించడమైనది. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీమతి పి వి ఎమ్ జయ లక్ష్మి సమర్థవంతంగా వాదనలు వినిపించారు. కోర్టు విధుల్లో కె. సతీష్ కోర్టు కానిస్టేబుల్‌గా వ్యవహరించారు. ఈ సంధర్భంగా ఎస్పీ పై కేసులో శిక్ష పడుటలో కీలక పాత్ర పోషించిన దర్యాప్తు అధికారులను, పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీమతి పి వి ఎమ్ జయ లక్ష్మి, సకాలంలో సాక్షులను ప్రవేశ పెట్టుటలో సహకరించిన కోర్టు కానిస్టేబుల్ కె సతీష్ ను, సర్పవరం ఇన్స్పెక్టర్ శ్రీ సి ఎచ్ ప్రకాష్ ప్రత్యేకంగా అభినందించారు.

# నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట స్థావరంపై దాడి



**గుంటూరు, 03 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి :** సోమవారం సాయంత్రం 6:00 గంటలకు నల్ల పాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని పెదపలకలూరు రోడ్డులో చెరువు ప్రక్కన ఉన్న పొలాల్లో పేకాట జరుగుతున్నట్లు టాస్క్ ఫోర్స్‌కు విశ్వసనీయ సమాచారం అందింది. సమాచారాన్ని డీఎస్‌బీ డీఎస్పీ కి తెలియజేసి, సీఐ-2 ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ మరియు నల్లపాడు పోలీస్ స్టేషన్ సిబ్బంది సంయుక్తంగా పేకాట జరుగుతున్న ప్రదేశంపై ఆకస్మిక దాడి నిర్వహించారు. దాడిలో పేకాట నిర్వహిస్తున్న ఆర్గనైజర్‌గా తమ్మిశెట్టి శ్రీనును గుర్తించారు. ఘటన స్థలంలో ఉన్న 6 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి 3 ద్విచక్ర వాహనాలు, 1 ఆటో, 5 సెల్ ఫోన్లు మరియు రూ.8,640 నగదును స్వాధీనం చేసుకున్నారు. సీజ్ చేసిన నగదు, వాహనాలు, సెల్‌ఫోన్లతో పాటు అదుపులోకి తీసుకున్న వ్యక్తులను తదుపరి చట్టపరమైనచర్యల నిమిత్తం నల్లపాడు పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు.

# పట్టాభిపురంలో పేకాట స్థావరంపై దాడి



**గుంటూరు, 03 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి :** సోమవారం సాయంత్రం 04:00 గంటలకు గుంటూరు జిల్లా పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని అశోక్‌నగర్ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ సెంటర్ పక్కన ఉన్న ఓ ప్రైవేట్ గెస్ట్ హౌస్‌లో పేకాట నిర్వహిస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్‌కు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ సమాచారాన్ని డీఎస్‌బీ డీఎస్పీ కి తెలియజేసి, సీఐ-2 ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది మరియు పట్టాభిపురం పోలీస్ స్టేషన్ సిబ్బంది సంయుక్తంగా దాడి నిర్వహించారు. దాడిలో పేకాట నిర్వహిస్తున్న ఆర్గనైజర్ కండె నాగేంద్రతో పాటు మొత్తం 5మంది వ్యక్తులను అదుపులోకితీసుకుని, వారివద్దనుంచి రూ.56,540ల నగదు, 5 సెల్‌ఫోన్లు,2 ద్విచక్ర వా హనాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను, స్వాధీనం చేసుకున్న నగదు మరియు ఇతర వస్తువులను తదుపరి చట్టపరమైన చర్యల కోసం పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. పేకాట వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై జిల్లా పోలీసులు నిరంతరం నిఘా ఉంచి, కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

# రమణయ్యపేటలో అక్రమ బార్ భవనం సీజ్




**కాకినాడ బ్యూరో, 03 ఆగస్టు 2026, భారత్ ప్రతినిధి :** కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేటలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన బార్ అండ్ రెస్టారెంట్ భవనాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్, కుడా వైస్ చైర్మన్ అపూర్వ భరత్ ఆకస్మిక తనిఖీల అనంతరం సీజ్ చేయించారు. భవనానికి సంబంధించిన బార్ బోర్డులను తొలగించి షట్టర్లకు అధికారిక సీల్ వేశారు. భవన నిర్మాణానికి అవసరమైన అనుమతులు, సెట్‌బ్యాక్ నిబంధనలు, డెవలప్‌మెంట్ ఛార్జీల చెల్లింపుల్లో ఉల్లంఘనలు గుర్తించిన అధి కారులు, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే లైసెన్స్ మంజూరు విషయాలపై ఆరా తీశారు.

# అంబటి రాంబాబు అతిపెద్ద రాజకీయ బఫున్ : కొర్రపాటి నాగేశ్వరావు

కూటమి నేతలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు

పెమ్మసానిపై అంబటి ఏఐ వీడియోలను విడుదల చేయటం సిగ్గుచేటు

గుంటూరు జిల్లాలో వైసీపీ కనుమరుగు ...

ఉనికి కోసమే అంబటి నీచపు పాట్లు

చంద్రబాబు, పవన్ కళ్యాణ్ నేత్రత్వంలో రాష్ట్రంలో సుపరిపాలన

జనసేన నేతలు కొర్రపాటి నాగేశ్వరావు, ఆళ్ళ హరి, చింతా రేణుకరాజు



**గుంటూరు, 03 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి :** తన మతిమాలిన వ్యాఖ్యలతో, వికృత చేష్టలతో వైసీపీ నేత అంబటి రాంబాబు రాష్ట్ర రాజకీయాల్లోనే అతిపెద్ద బఫున్ గా మారాడని పత్తిపాడు నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయ కర్త కొర్రపాటి నాగేశ్వరావు విమర్శించ్చారు. కూటమి నేతలపై అసందర్భంగా, అకారణంగా వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని ఆయన వైసీపీ నేతల్ని హెచ్చరించారు. సోమవారం శ్రీనివాసరావుతోటలోని పార్టీ కార్యాలయంలో కొర్రపాటి నాగేశ్వరావు విలేకరులతో మాట్లాడారు. అవినీతికి, అక్రమాలకు, హత్యారాజకీయాలకు, కులమత విద్వేషాలకు బ్రాండ్ అంబాసిడర్ గా మారిన వైసీపీ నేతలకు కూటమి నాయకుల్ని విమర్శించే అర్హత లేదన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి , సంక్షేమం రెండు కళ్లుగా ముందుకు సాగుతున్నాయని పేర్కొన్నారు. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో గతంలో ఎన్నడూ లేని విధంగా గుంటూరు జిల్లా అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని అనందాన్ని వ్యక్తం చేశారు. ప్రజలు వైసీపీని మరచిపోయారని ఉనికి కోసమే పెమ్మసాని చంద్రశేఖర్ పై ఏ ఐ వీడియోలు పెట్టి అంబటి శునకానందం పొందుతున్నాడని దుయ్యపట్టాడు. కూటమి పాలనలో ప్రజలు ఆనందంగా ఉన్నారని వైసీపీకి ఇక అధికారం కల్లే నని కొర్రపాటి వ్యాఖ్యానించ్చారు.. తన ఇంటిపై జరిగిన దాడి సంఘటనను అంబటి రాజకీయ లబ్ది కోసం వాడుకోవాలని చూస్తున్నారని జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి విమర్శించ్చారు. ఉపాసకులు చాగంటి కోటేశ్వరరావు, గరికిపాటి నరసింహారావులు చెప్పినట్లు అంబటి రాంబాబు ప్రవచనాలు చెబితే దాడులు చేయ లేదని, పెమ్మసాని పై ఏఐ వీడియోలు, ఫోటోలు, పాటలు క్రియేట్ చేసి ఇంస్టాగ్రామ్ లో, సోషల్ మీడియాలో విడుదల చేసి అంబటి పైశాచికంగా వ్యవహారిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబటిపై ఏఐ ని అడిగితే ఏ సర్టిఫికట్ చిత్రాలు, వీడియోలు పంపిస్తుందన్నారు. తాము అన్నం తింటున్నా మని, తమకు సభ్యతా సంస్కారాలు ఉన్నాయని అందుకే వాటి జోలికి పోవటం లేదన్నారు పెమ్మసాని సంపాదన గురించి అంబటి తరచూ వ్యాఖ్యా నించటం పట్ల అయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పెమ్మసాని తాను కష్టపడి సంపాదించుకున్న జ్ఞానాన్ని, మేధస్సును పంచి సంపాదించు కున్నారని, వైసీపీ నేతల్లా నిలువెల్లా అవినీతి మయం అయింది కాదన్నారు మరో మూడేళ్ళలో గుంటూరు పార్ల మెంట్ ను కూటమి నేతలు అభివృద్ధిలో అగ్రస్థానంలో ఉండేలా కృషి చేస్తున్నారని ఆళ్ళ హరి అన్నారు. లేబర్ సం క్షేమ బోర్డు డైరెక్టర్ చింతా రేణుకరాజు మాట్లాడుతూ కాపు కులానికే అంబటి రాంబాబు మాయని మచ్చలా తయారు అయ్యాడన్నారు.జగన్ రెడ్డి దగ్గర కుక్కలా ఉంటానని బహి రంగంగా చెప్పిన అంబటికి కాపు కులంలో చోటు లేదన్నారు. కాపుల ఔన్నత్యాన్ని, ఆత్మభిమానాన్ని దెబ్బ తీసేలా వ్యాఖ్యలు చేసిన అంబటిని కాపు కులం ఎప్పుడో వెలేసిం దని చింత రాజు అన్నారు.

6

# బీహార్‌లో బీజేపీకి అతిపెద్ద షాక్

**బంకీపూర్ అసెంబ్లీ సీటు ఉపఎన్నికలో ప్రశాంత్ కిషోర్ ఘనవిజయం**

**జన్ సురాజ్ పార్టీకి తొలి గెలుపు.. ఇక అసెంబ్లీలోకి ఎంట్రీ**

**యువత, జెనీ మద్దతుతోనే విజయం: పీకే**

**నేరస్థుల పాలనకు ప్రజలు నో: పీకే**



**పాట్నా :** బిహార్‌లో సరికొత్త రాజకీయం ఆవిష్కృతం అయ్యింది. అలాగే బిజెపికి అతిపెద్ద షాక్ తగిలింది. బంకీపూర్ శాసనసభ ఉపఎన్నికలో జన్ సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిషోర్ సంచలన విజయం సాధించారు. గత 30 ఏళ్లుగా బిజెపికి కంచుకోటగా ఉన్న ఈ నియోజకవర్గంలో పీకే గెలుపు జెండా ఎగరేశారు. ప్రశాంత్ కిశోర్ తన సమీప బీజేపీ అభ్యర్థి నీరజ్ సిన్హాపై 18,953 ఓట్ల భారీ తేడాతో ఘన విజయం సాధించారు. ఉదయం కౌంటింగ్ మొదలైనప్పటి నుంచీ బీజేపీ నేత నీరజ్ కుమార్ కంటే ముందంజలో ఉన్న ప్రశాంత్ కిశోర్ ఒక్కో రౌండ్ ముగిసేసరికి తన ఆధిక్యాన్ని అంతకంతకూ పెంచుకున్నారు. పీకేకు 63,203 పోలయ్యాయి. అలానే రెండో స్థానంలో నిలిచిన బీజేపీ అభ్యర్థి నీరజ్ కుమార్ కు 44,250, మూడో స్థానంలో నిలిచిన ఆర్జేడీ అభ్యర్థి రేఖ కుమారి 14,085 ఓట్లు సాధించారు. ఈ చరిత్రాత్మక విజయం అనంతరం ప్రశాంత్ కిషోర్ మాట్లాడుతూ.. తన గెలుపు బీజేపీ హైకమాండ్‌కు ఒక బలమైన సందేశమని వ్యాఖ్యానించారు. నేర చరిత్ర కలిగిన వ్యక్తిని బిహార్ ముఖ్యమంత్రిగా చేశారని తీవ్రస్థాయిలో మండిపడిన ఆయన, సామ్రాట్ చౌదరిని వెంటనే సీఎం పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ ఉపఎన్నిక ఫలితం బిహార్ రాజకీయాల్లో సరికొత్త మార్పునకు సంకేతమని ఆయన పేర్కొన్నారు. రాజ్యసభకు ఎన్నికైన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్.. బంకీపూర్ ఎమ్మెల్యేగా రాజీనామా చేశారు. దీంతో ఆ నియోజకవర్గానికి ఉప ఎన్నిక నిర్వహించారు. బీజేపీ కంచుకోటగా పేరున్న ఈ నియోజకవర్గంలో.. 1995 నుంచి బీజేపీ అభ్యర్థులే విజయం సాధిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రశాంత్ కిశోర్ అసాధారణ విజయం సాధించడం, బీజేపీ కంచుకోటలో జేఎస్‌పీ జెండా ఎగురవేయడం యావత్ దేశం దృష్టిని ఆకర్షించింది. ప్రశాంత్ విజయంతో.. జేఎస్పీ శ్రేణులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నాయి.

ప్రశాంత్ కిషోర్ మాట్లాడుతూ. బంకీపూర్ ప్రజల విజయమిది అని అన్నారు. 30 సంవత్సరాల పాత కోట 30 రోజుల్లో కూలిపోయిందని ఆయన అన్నారు. ఇది కేవలం ఎమ్మెల్యేను ఎన్నుకునే ఎన్నిక కాదని బీహార్కు మంచి ముఖ్యమంత్రి కావాలని బీజేపీ కేంద్ర నాయకత్వానికి ప్రజలు పంపిన సందేశమని చెప్పారు. నేరపూరిత నేపథ్యం లేదా ప్రవర్తనపై ప్రశ్నలున్న వ్యక్తి నాయకత్వం ప్రజలకు ఆమోదయోగ్యం కాదని ఆయన అన్నారు. విద్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు సృష్టించి బీహార్ యువత వలసలు ఆపే ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుతున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కేంద్ర హోం మంత్రి అమిత్ షా లోక్సభ ఎన్నికలకు ముందు బీహార్ అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరారు. గత 30 సంవత్సరాలుగా బీహార్కు

కేవలం పేదరికం, అవినీతి మాత్రమే లభించాయని ఆయన ఆరోపించారు. బంకీపూర్లో రెండు మూడు నెలల్లో కొన్ని మార్పులు కనిపిస్తాయని హామీ ఇచ్చారు. తాను ఎమ్మెల్యే అయినంత మాత్రాన బంకీపూర్ బెంగళూరు కాదని అయితే కొంత అభివృద్ధి కనిపిస్తుందని అన్నారు. ఈ విజయం బీహార్ అభివృద్ధికి అంకితమని ఆయన స్పష్టం చేశారు

## సహజీవనం కూడా చట్టబద్ధమైన జీవితమే

**భాగస్వామిని వేధింపులకు గురి చేస్తే చట్టప్రకారం శిక్ష**

**సుప్రీం ధర్మాసనం సంచలన తీర్పు**

**న్యూఢిల్లీ :** సహజీవనం అంశంపై భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది. సహజీవనంలో భాగస్వామిని వేధింపులకు గురి చేస్తే భారతీయ శిక్షాస్మృతి లోని సెక్షన్ 498-ఏ ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయవచ్చని స్పష్టం చేసింది. పెళ్లి కాలేదనే కారణంతో భర్త స్థానంలో ఉన్న వ్యక్తి వేధింపుల ఆరోపణల నుంచి తప్పించుకోలేరని పేర్కొంది. వివాహం జరగలేదన్న కారణాన్ని చూపి బాధితురాలికి చట్టపరమైన రక్షణ కల్పించకపోవడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14కు విరుద్ధమని తెలిపింది.



ఈ మేరకు జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించింది. ఈ సందర్భంగా భర్త అనే పదానికి ధర్మాసనం విస్తృత వివరణను ఇచ్చింది. సహజీవన చేస్తున్న వ్యక్తిని భర్తతో సమానంగా పరిగణించవచ్చని తెలిపింది. ఇలాంటి వ్యక్తులు భాగస్వామిని వేధించి తప్పించుకోలేరని ధర్మాసనం పేర్కొంది. అయితే, అన్ని రకాల సహజీవనాలకు ఈ తీర్పు వర్తించదని స్పష్టం చేసింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి సహజీవనం చేస్తూ హింసకు పాల్పడిన వారికే సెక్షన్ 498-ఏ వర్తిస్తుందని వెల్లడించింది. అలాగే, ప్రాథమిక విచారణ నిర్వహించకుండా తక్షణ అరెస్టులు చేయవద్దని పోలీసులకు కఠిన ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా సెక్షన్ 498-ఏ ఉద్దేశాన్ని ధర్మాసనం వివరించింది. ఈ సెక్షన్ మహిళలను భర్త లేదా అతని కుటుంబ సభ్యుల మానసిక, శారీరక వేధింపుల నుంచి రక్షించడానికే అని గుర్తు చేసింది.

అలాంటి వేధింపులు కేవలం చట్టబద్ధమైన వివాహ బంధంలోనే జరుగుతాయని భావించడం వాస్తవాలకు విరుద్ధమని వ్యాఖ్యానించింది. వివాహిత మహిళకు ఒక రకమైన రక్షణ కల్పించి, అదే తరహా సంబంధంలో ఉన్న మరో మహిళకు రక్షణ నిరాకరించడం సహేతుకం కాదని ధర్మాసనం అభిప్రాయ పడింది. వ్యక్తిగత స్వేచ్ఛలో భాగంగా జీవిత భాగస్వామిని ఎంచుకునే హక్కును చట్టం గుర్తించిందని ధర్మాసనం తెలిపింది. ఆ విధంగా భాగస్వామిని ఎంచుకున్న మహిళకు చట్టపరమైన రక్షణను నిరాకరించలేమని పేర్కొంది. సహజీవనం చేస్తున్న మహిళకు తన భాగస్వామి లేదా అతని కుటుంబ సభ్యుల నుంచి వేధింపులు ఎదురైతే ఆమెకు కూడా సమాన చట్టపరమైన రక్షణ కల్పించాల్సిందేనని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది.

## ఎన్‌కౌంటర్‌లో కరుడుగట్టిన గ్యాంగ్‌స్టర్ హతం

**తుపాకీ లాక్కుని పారిపోతుండగా కాల్పులు**

**రాంచీ:** ఝార్ఖండ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఓ కరుడుగట్టిన గ్యాంగ్‌స్టర్ హతమయ్యాడు. పోలీసుల తుపాకీ లాక్కుని పారిపోతుండగా జరిగిన ఎన్‌కౌంటర్‌లో గ్యాంగ్‌స్టర్ సుజిత్ సిన్హా మరణించాడని పోలీసులు తెలిపారు. సాహిబ్‌గంజ్ డివిజనల్ జైలుకు అతడిని తరలిస్తుండగా శనివారం రాత్రి ఈ ఘటన జరిగిందని చెప్పారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం, ధన్‌బాద్ జైలు నుంచి సాహిబ్‌గంజ్ మండల్ జైలుకు తరలిస్తుండగా సాహిబ్‌గంజ్ హైవేపై ఈ ఘటన జరిగింది. నాలుగు పోలీసు వాహనాల ఎస్కార్ట్‌తో అతడిని పోలీసులు తరలించారు. అయితే, జమ్‌తారా పోలీస్ స్టేషన్ పరిధిలోకి కాన్వాయ్ వచ్చేసరికి తాను మరుగుదొడ్డికి వెళ్లాలని అతడు కోరాడు. వాహనాలు ఆపిన సమయంలో అతడు తుపాకీ లాక్కుని చీకట్లోకి పారిపోయేందుకు ప్రయత్నించాడని పోలీసులు తెలిపారు. తమపై కాల్పులు కూడా జరిపాడని అన్నారు. స్వీయరక్షణ కోసం తాము కాల్పులు జరపాల్సి వచ్చిందని చెప్పారు. అతడు ఘటనా స్థలంలోనే మరణించినట్లు అక్కడికి వచ్చిన మెడికల్ టీమ్ ప్రకటించింది. జమ్‌తారా ఎస్పీ శంభు కుమార్ సింగ్ ఆధ్వర్యంలో ఈ ఉదంతంపై దర్యాప్తు కొనసాగుతోంది. ఝార్ఖండ్‌లో సిన్హాపై అనేక కేసులు ఉన్నాయి. బలవంతపు వసూళ్లు, హత్య, హత్యాయత్నం తదితర కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. రాష్ట్రంలో తన ఇన్‌ఫ్లుయెన్స్‌ను కొనసాగించేందుకు పలు గ్యాంగులతో జట్లు కట్టి నెట్‌వర్క్‌ను నిర్మించుకున్నాడని పోలీసులు తెలిపారు.


# కర్నాటక కాంగ్రెస్‌లో విస్తరణ చిచ్చు

**20 మంది కొత్త మంత్రుల ప్రమాణం**

**చోటు దక్కని పలువురు ఎమ్మెల్యేల ఆగ్రహం**

**అసమ్మతి నేతల ఆందోళనలు..ధర్నాలు**

**ఎమ్మెల్యే యశ్వంతరాయ గౌడ పాటిల్ రాజీనామా**



**బెంగళూరు :** కర్ణాటక ముఖ్యమంత్రి డీ.కే. శివకుమార్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన మంత్రివర్గ విస్తరణ రాష్ట్ర కాంగ్రెస్‌లో చిచ్చు రేపింది. ఆగ్రహావేశాలు, ఆనందోత్సాహాలను చవిచూడాల్సి వచ్చింది. కొందరిలో విపరీతమైన ఆనందోత్సాహానికి, మరికొందరిలో తీవ్ర ఆగ్రహావేశాలకు కారణమైంది. ఏకంగా 20 మంది కొత్త మంత్రుల ప్రమాణస్వీకారంతో ఒకవైపు పండుగ వాతావరణం సంతరించుకోగా, మరోవైపు తీవ్ర అసమ్మతి, ధర్నాలు, ఆందోళనలకు దారితీసింది. కేబినెట్‌లో చోటు దక్కకపోవడంతో అసమ్మతి నేతలు బహిరంగంగానే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి పదవి దక్కకపోవడంపై తీవ్ర మనస్థాపానికి గురైన ఎమ్మెల్యే యశ్వంతరాయ గౌడ పాటిల్ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. 'పార్టీ నాయకత్వం నన్ను తీవ్రంగా గాయపరిచింది. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాను' అని ఆయన పేర్కొన్నారు. అలాగే బేలూరు ఎమ్మెల్యే గోపాలకృష్ణ కూడా రాజీనామా చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు, మైసూర్ నాయకుడు తన్వీర్ సేట్‌కు మంత్రివర్గంలో చోటు నిరాకరించడంతో, ఆయన మద్దతుదారుడొకరు మైసూరులో విషం తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డారు. అతన్ని ప్రస్తుతం ఆసుపత్రికి తరలించగా, తన్వీర్ సేట్ నేరుగా వెళ్లి

పరామర్శించారు. ధార్వాడ్‌లో ప్రసాద్ అబ్బయ్య మద్దతుదారులు రహదారిపై టైర్లు కాల్చి, ప్రభుత్వ బస్సుపై రాళ్ళు రువ్వి ఆందోళన చేపట్టారు. అసమ్మతి నేతల రహస్య భేటీ: హెచ్‌కే పాటిల్, దినేష్ గుండూరావుతో సహా పదవులు దక్కని సీనియర్ నాయకులు బెంగళూరులోని పీ.వీ. జయచంద్ర నివాసంలో అత్యవసర రహస్య సమావేశం ఏర్పాటు చేసి తదుపరి కార్యాచరణపై చర్చిస్తున్నారు.మంత్రి మునియప్ప అసంతృప్తి: మరోవైపు సీనియర్ నేత, కేబినెట్ మంత్రి కె.హెచ్. మునియప్ప కూడా తన శాఖ కేటాయింపుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, శాఖను మార్చాలని కోరుతున్నట్లు సమాచారం.

ప్రమాణస్వీకారానికి కొన్ని గంటల ముందు కేబినెట్ జాబితాలో నాటకీయ మార్పులు చోటుచేసుకున్నాయి. తొలుత ప్రకటించిన ముసాయిదా నుంచి మంకాల్ వైద్య, గాయత్రి చంద్రశేఖర్‌లను తొలగించి, ఆఖరి నిమిషంలో సీనియర్ నేత ఎస్.ఎస్. మల్లికార్జున్‌కు కేబినెట్‌లో స్థానం కల్పించారు. కర్ణాటక కాంగ్రెస్ విస్తరణపై బీజేపీ ఐటీ సెల్ చీఫ్ అమిత్ మాలవీయా తీవ్ర విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ చెబుతున్న సామాజిక న్యాయం, మహిళా సాధికారత మాటలకే పరిమితమని ఎద్దేవా చేశారు. కేబినెట్‌లో ఏకైక మహిళకే చోటు ఇవ్వడం, బ్రాహ్మణ సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం లేకపోవడం, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న బి. నాగేంద్ర, జమీర్ అహ్మద్ ఖాన్‌లను తిరిగి కేబినెట్‌లోకి తీసుకోవడం కాంగ్రెస్ డొల్లతనాన్ని బయటపెడుతోందని ఆరోపించారు.

## నా విద్యార్హతలు... రుణాలు తెరిచిన కాగితం

**బోస్టన్ వర్సిటీలో చదవడంపై వారికెందుకంత కచ్చ**

**బీజేపీ నేతలు కూడా వారి విద్యార్హతలు తెలిపితే మంచిది**

**ఆర్‌టిఐ ద్వారా సమాచార ప్రశ్నకు అభిజిత్ దీప్కే ఘాటు స్పందన**

**ముంబై :** బీజేపీ కార్యకర్త ఒకరు సమాచార హక్కు చట్టం ఆర్టీఐ ద్వారా తన విద్యార్హతల వివరాలను కోరడంపై కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్పందించారు. బీజేపీ నేతలు కూడా కూడా తమ విద్యకు సంబంధించిన డిగ్రీలను బహిరంగపరచాలని సవాల్ చేశారు. 'నా స్కాలర్‌షిప్ లేఖ, విద్యారుణ లేఖను వెల్లడించడానికి నేను సిద్ధంగా ఉన్నా. చక్రవర్తి తన డిగ్రీని చూపిస్తారా అని అభిజిత్ ప్రధాని మోదీ విద్యార్హతను ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా, బీజేపీ నాయకులు కూడా తమ విద్యార్హతలను బహిరంగపరుస్తారా? అని అభిజిత్ దీప్కే ప్రశ్నించారు. 'ఒక బీజేపీ కార్యకర్త నాపై ఆర్‌టిఐ దాఖలు చేసి, నా చదువు ఎలా పూర్తి చేశానో తెలుసుకోవాలనుకుంటున్నట్లు ఇప్పుడే చూశాను. మీ నాయకులు వారి డిగ్రీని చూపిస్తారా అని ఆయనను నేను అడగాలనుకుంటున్నా అని అన్నారు. మరోవైపు తన విద్యా నేపథ్యం ఎందుకు ఒక సమస్యగా మారింది? అని అభిజిత్ ప్రశ్నించారు. 'ఒక సాధారణ యువకుడు బోస్టన్ యూనివర్సిటీలో చదివితే వారికేం బాధ. విద్య పట్ల మీకెందుకంత వ్యతిరేకత? అని నిలదీశారు. బోస్టన్ యూనివర్సిటీ స్కాలర్‌షిప్, విద్యా రుణంతో తన చదువు కోసం ఆర్థిక సహాయం పొందినట్లు ఆయన వివరించారు. విద్యా రుణం తిరిగి చెల్లించాల్సి ఉందన్నారు. ప్రతి ఒక్కరూ దీనిపై విచారణ జరుపవచ్చని దీప్కే అన్నారు. నీట్ లీక్ వివాదంపై నిరసన ఉద్యమానికి నేతృత్వం వహించడానికి జూన్‌లో భారత్‌కు ఆయన తిరిగి వచ్చారు.

## జార్ఖండ్‌లో పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేపర్ లీక్

**సమగ్ర విచారణ జరపాలంటూ విద్యార్థుల డిమాండ్**

**నిరాహారదీక్షకు దిగిన విద్యార్థులు.. మద్దతుగా ఆందోళన**

**ఆందోళనకు మద్దతు తెలిపన కాక్రోచ్ నేత అభిజిత్ దీప్కే**

**రాంచీ :** నీట్ పేపర్ లీక్ నిరసనలతో కొన్నిరోజుల క్రితం దేశ రాజధాని దిల్లీ ఉద్రిక్తంగా మారగా.. ఇప్పుడు ఝార్ఖండ్‌లో అదే పరిస్థితి కనిపిస్తోంది. ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రిలిమినరీ పరీక్షలో అవకతవకలు చోటుచేసుకున్నాయని రాజధాని నగరం రాంచీలో ప్రారంభమైన ఆందోళనలు ఉద్ధృతంగా మారాయి. నియామక పరీక్షను రద్దు చేయాలని, ఆ ఆరోపణలపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలని, నియామక వ్యవస్థలో సంస్కరణలు చేపట్టాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ విద్యార్థి నాయకుడు దేవేంద్రనాథ్ మహతో ఆదివారం జైపాల్ సింగ్ ముండా స్టేడియంలో నిరాహార దీక్ష ప్రారంభించారు. ఈ ఆందోళనలకు కాక్రోచ్ జనతాపార్టీ మద్దతు ప్రకటించింది. జేపీఎస్‌సీ పరీక్ష ఫలితాలు గతనెల విడుదలయ్యాయి. తర్వాత ముఖ్యమంత్రిని కలిసి, పేపర్ లీక్‌పై ఆధారాలను సమర్పించాం. కొన్నివారాలుగా నిరసనలు జరుగుతున్నా.. విద్యార్థుల ఆందోళనలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం, జేపీఎస్‌సీ తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమైంది. దాంతో విద్యార్థులు నిరుత్సాహానికి గురవుతున్నారు. వారిలో మనోధైర్యాన్ని నింపేందుకు, మా పోరాటాన్ని ఉద్ధృతం చేసేందుకు నిరాహార దీక్ష ప్రారంభిస్తున్నాను. నిందితులకు శిక్ష పడటమే మా ప్రధాన లక్ష్యం అని స్టేడియంలోని ఆందోళనకారులను ఉద్దేశించి మహతో మాట్లాడారు. పేపర్ లీక్ ఆరోపణలు, నియామక ప్రక్రియలో అవకతవకలు, పాలనాపరమైన లోపాలతో తమ కెరీర్‌కు తీవ్రనష్టం వాటిల్లుతోందంటూ ఆ రాష్ట్రంలోని విద్యార్థులు కొన్ని వారాల క్రితం నిరసనలు ప్రారంభించారు. జేపీఎస్‌సీ, జేఎస్ఎస్‌సీ సీజీఎల్ పరీక్షలకు సంబంధించి ఓఎంఆర్ షీట్ వైరల్ అయిన తర్వాతే ప్రభుత్వం స్పందించిందని ఆందోళనకారులు విమర్శించారు. ఈ పరీక్షల విషయంలో సంస్థాగత మార్పులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. వీరికి సీజేపీ మద్దతు ప్రకటించింది. నిరసనకారులతో మాట్లాడాం. వారికి మేం అండగా ఉంటాం. వారి డిమాండ్లకు మా మద్దతు ఉంటుందని అభిజీత్ దీప్కే ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రిలిమినరీ పరీక్షలో పేపర్ లీకైనట్టు ఆరోపణలు రావడంతో అక్కడి విద్యార్థులు గత కొన్ని రోజులుగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో కాక్రోచ్ జనతా పార్టీ తాజాగా ఝార్ఖండ్ విద్యార్థులకు మద్దతు ప్రకటించింది. దేశరాజధాని రాంచీలో ప్రస్తుతం విద్యార్థుల నిరసనలు మిన్నంటాయి. పేపర్ లీక్ ఉదంతంపై దర్యాప్తు జరపాలని విద్యార్థులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. రాంచీలోని జైపాల్ సింగ్ ముండా స్టేడియం వద్ద విద్యార్థులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. విద్యార్థి నాయకుడు దేవేంద్ర నాథ్ మహతో ఆదివారం ఆమరణ దీక్ష ప్రారంభించారు. వారాల తరబడి నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు తీసుకోవడంలో విఫలమైందని మహతో ఆరోపించారు. కమిషన్, ప్రభుత్వం తీరుతో విద్యార్థుల మనోవేదనకు గురవుతున్నారని అన్నారు. ముఖ్యమంత్రి తమ డిమాండ్స్‌కు ఆమోదం తెలిపే వరకూ తన దీక్ష కొనసాగుతుందని చెప్పారు. ఇటీవల జరిగిన ప్రిలిమినరీ పరీక్షను రద్దు చేయాలని కూడా ఆయన డిమాండ్ చేశారు. ఈ మధ్యకాలంలో టీడీపీఎల్ ద్వారా జరిగిన పరీక్షలను సమీక్షించాలని డిమాండ్ చేశారు. ఎగ్జామ్‌లోనైనా పేపర్ లీక్ జరుగుతూనే ఉందని ఒక విద్యార్థులు మండిపడ్డారు. ఈ విషయాలపై సీఎం హేమంత్ సోరెన్ తమతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు.

## అసోంలో అమానవీయ ఘటన

**బాలికపై అత్యాచారం.. దారుణ హత్య**

**గౌహతి :** అస్సాంలో అమానవీయ ఘటన చోటుచేసుకుంది. 15 ఏళ్ల బాలిక అత్యాచారానికి గురై, అతి దారుణమైన స్థితిలో ప్రాణాలు కోల్పోయింది. కుటుంబ సభ్యులే ఆమెను గుర్తించలేని స్థితిలో ఇంట్లో శవమై కనిపించిందని పోలీసు వర్గాలు వెల్లడించాయి. అస్సాంలోని హైలాఖాండీ జిల్లాకు చెందిన ఓ బాలిక కుటుంబ సభ్యులతో కలిసి సమీపంలోని బంధువుల ఇంట్లో ఫంక్షన్‌కు వెళ్లింది. అయితే తన కజిన్‌తో గొడవ కారణంగా తిరిగి ఇంటికి వచ్చేసింది. వేడుక అనంతరం వారు ఇంటికి వచ్చేసరికి తమ కుమార్తెను ఆ స్థితిలో చూసి హతాశులయ్యారు. హత్య చేయడానికి ముందు తమ బిడ్డపై అత్యాచారం జరిగిందని వారు ఆరోపించారు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆమె తల, ముఖం గుర్తుపట్టలేని విధంగా ఛిద్రమైందని, వ్యక్తిగత అవయవాల్లోకి రాడ్డు చొప్పించారని పోలీసు వర్గాలు వెల్లడించాయి. శవపరీక్ష అనంతరం లైంగికదాడి జరిగిందా లేదా అనేది తెలుస్తుందని, హత్యకు గల కారణాలపై స్పష్టత వస్తుందని పేర్కొన్నాయి. ఈ ఘటనపై స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలంటూ జాతీయ రహదారిని దిగ్బంధించారు. ప్రస్తుతం ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## విద్యార్థులపై నమోదైన కేసులు వెనక్కి

**ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.. సుప్రీంకోర్టుకు వివరించిన కేంద్ర ప్రభుత్వం**

**న్యూఢిల్లీ :** జంతర్‌మంతర్ వద్ద గత నెలలో విద్యార్థుల ఆందోళనల సందర్భంగా నమోదైన ఎఫ్ఐఆర్ ల విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీపై సుప్రీంకోర్టు సోమవారం విచారణ చేపట్టింది. విద్యార్థులపై నమోదైన కేసులను ముందుకు తీసుకెళ్లబోమన్న తమ హామీకి కట్టుబడి ఉన్నామని ధర్మాసనానికి కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ హామీని అత్యంత బాధ్యతగా అమలు చేయాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం, ప్రభుత్వం కోర్టుకు ఇచ్చిన హామీ కేవలం మాటల్లోనే కాకుండా ఆచరణలోనూ కనిపించాలని పేర్కొంది. గతంలో ఇచ్చిన హామీలకు విరుద్ధంగా విద్యార్థులపై అనవసరమైన చట్టపరమైన చర్యలు కొనసాగించకూడదని సూచించింది. విద్యార్థులపై బలవంతపు చర్యలు తీసుకోవద్దని ఇప్పటికే సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే నమోదైన ఎఫ్ఐఆర్‌ల దర్యాప్తు అంశంపై వివాదం కొనసాగుతుండటంతో, ప్రభుత్వం తన హామీని ఎలా అమలు చేస్తుందనే అంశంపై కోర్టు దృష్టి సారించింది. ఇక విద్యార్థుల ఆందోళనలకు నాయకత్వం వహిస్తున్న సీజేపీ మాత్రం ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం అన్ని ఎఫ్ఐఆర్‌లను పూర్తిగా ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేస్తోంది. హామీలు అమలు కాకపోతే దేశవ్యాప్తంగా మళ్లీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించింది.

# భారత్‌కు చేరిన కామన్వెల్త్ పతాకం..

## 2030లో అహ్మదాబాద్‌లో శతాబ్ది క్రీడలు



స్కాట్లాండ్‌లోని గ్లాస్గో వేదికగా జరిగిన 2026 కామన్వెల్త్ క్రీడలు అట్టహాసంగా ముగిశాయి. ఈ ముగింపు వేడుకల్లో తదుపరి క్రీడలకు ఆతిథ్యమివ్వనున్న భారత్‌కు అధికారికంగా బాధ్యతలు అప్పగించారు. కామన్వెల్త్ క్రీడల పతాకాన్ని భారత ఒలింపిక్ పతక విజేత నీరజ్ చోప్రా, భారత ఒలింపిక్ సంఘం (ఐవోఏ) అధ్యక్షురాలు పీటీ ఉష అందుకున్నారు. 2030లో గుజరాత్‌లోని అహ్మదాబాద్ వేదికగా జరగనున్న ఈ క్రీడలు.. కామన్వెల్త్ చరిత్రలో శతాబ్ది (100వ) క్రీడలు కావడం విశేషం. గ్లాస్గోలోని ఓవో హైడ్రో ఎరీనాలో జరిగిన ఈ కార్యక్రమంలో కామన్వెల్త్ స్పోర్ట్ అధ్యక్షుడు డాక్టర్ డొనాల్డ్ రుకారే సమక్షంలో పతాక మార్పిడి జరిగింది. ముందుగా కామన్వెల్త్ గేమ్స్ పతాకాన్ని అవనతం చేసిన తర్వాత గ్లాస్గో లార్డ్ ప్రొవోస్ట్ జాక్వెలిన్ మెక్‌లారెన్ దానిని భారత ప్రతినిధులైన నీరజ్ చోప్రా, పీటీ ఉషలకు అందజేశారు. దీంతో స్కాట్లాండ్ నుంచి భారత్‌కు అధికారికంగా ఆతిథ్య బాధ్యతలు బదిలీ అయ్యాయి. ఈ ఘట్టం తర్వాత, భారత సాంస్కృతిక వారసత్వాన్ని చాటుతూ అద్భుతమైన ప్రదర్శన సాగింది. 'వసుధైక కుటుంబం' (ప్రపంచమంతా ఒకే కుటుంబం) అనే ప్రాచీన భారతీయ తత్వాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. సంగీతం, నృత్యం, కథల రూపంలో సాగిన ఈ ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా బ్రిటన్ రాజు కింగ్ చార్లెస్ III తరఫున హాజరైన ప్రిన్స్ ఎడ్వర్డ్ మాట్లాడుతూ అథ్లెట్లను అభినందించారు. "నాలుగేళ్ల తర్వాత జరగనున్న 24వ కామన్వెల్త్ క్రీడల కోసం, అలాగే శతాబ్ది ఉత్సవాల కోసం మీరందరూ అహ్మదాబాద్‌కు రావాలని నేను ఆహ్వానిస్తున్నాను" అని ఆయన పిలుపునిచ్చారు. కాగా, ఈ ముగింపు వేడుకల్లో భారత పతాకధారిగా మహిళల 57 కేజీల బాక్సింగ్‌లో స్వర్ణం గెలిచిన జాస్మిన్ లాంబోరియా వ్యవహరించారు.

# పంజాబ్‌లో కొత్త టీ20 లీగ్

## బరిలోకి గిల్, అర్ష్‌దీప్




పంజాబ్ క్రికెట్‌లో నూతన అధ్యాయం ఆరంభమైంది. రాష్ట్రంలోని యువ ప్రతిభను వెలికితీసే లక్ష్యంతో 'షేర్-ఏ-పంజాబ్ టీ20 లీగ్'ను అధికారికంగా ప్రారంభించారు. ఆదివారం న్యూ చండీగఢ్‌లోని పీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ లీగ్ లోగోను ఆవిష్కరించారు. భారత క్రికెట్ జట్టు స్టార్ ఆటగాళ్లు శుభ్‌మన్ గిల్, అర్ష్‌దీప్ సింగ్ ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ లీగ్ తొలి సీజన్ ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ 13 వరకు నిర్వహించనున్నారు. ఇందులో అమృత్‌సర్, ఫాజిల్కా జలంధర్, లూధియానా, మొహాలీ, బఠిండా ప్రాతినిధ్యం వహించే ఆరు ఫ్రాంచైజీలు తలపడనున్నాయి. రౌండ్-రాబిన్ పద్ధతిలో మొత్తం 27 మ్యాచ్‌లు జరుగుతాయి. శుభ్‌మన్ గిల్, అర్ష్‌దీప్ సింగ్‌లతో పాటు అభిషేక్ శర్మ, గుర్నూర్ బ్రార్, ప్రభ్‌సిమ్రాన్ సింగ్ వంటి స్టార్ ప్లేయర్లు ఈ టోర్నీలో సందడి చేయనున్నారు. పంజాబ్ క్రికెట్ అసోసియేషన్ (పీసీఏ) కార్యదర్శి గుర్మీత్ సింగ్ మీత్ హేయర్, అధ్యక్షుడు అమర్‌జీత్ సింగ్ మెహతా ఈ లీగ్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శుభ్‌మన్ గిల్ మాట్లాడుతూ.. "యువ క్రికెటర్లు తమ ప్రతిభను చాటుకుని, పంజాబ్, భారత జట్లకు ఎంపికయ్యేందుకు ఇది ఒక అద్భుతమైన వేదిక" అని పేర్కొన్నాడు. ముఖ్యమంత్రి భగవంత్ సింగ్ మాన్ ఆలోచనలకు అనుగుణంగా ఈ లీగ్ రూపుదిద్దుకుందని, లాలా అమర్‌నాథ్, యువరాజ్ సింగ్ వంటి దిగ్గజాల వారసత్వాన్ని ఇది కొనసాగిస్తుందని పీసీఏ కార్యదర్శి మీత్ హేయర్ తెలిపారు. ఈ లీగ్ నిమిత్తం ఆగస్టు 9న ఆటగాళ్ల వేలం నిర్వహించనున్నారు. ప్రతి ఫ్రాంచైజీకి రూ.45 లక్షల మేర వేతన పరిమితిని నిర్ణయించారు. మార్క్యూ ప్లేయర్‌కు రూ.10 లక్షలు, ఐకాన్ ప్లేయర్‌కు కనీస ధర రూ.1.5 లక్షలుగా ఖరారు చేశారు. ఈ లీగ్ ద్వారా యువ ఆటగాళ్లు అంతర్జాతీయ స్థాయి స్టార్లతో డ్రెస్సింగ్ రూమ్ పంచుకోవడం వారి భవిష్యత్తుకు ఎంతో మేలు చేస్తుందని పీసీఏ అధ్యక్షుడు అమర్‌జీత్ సింగ్ మెహతా ఆశాభావం వ్యక్తం చేశారు.

# టీమిండియాలో కీలక మార్పు..

## కొత్త ఫీల్డింగ్ కోచ్‌గా సుభదీప్ ఘోష్




శ్రీలంకతో జరగనున్న కీలకమైన టెస్ట్ సిరీస్‌కు ముందు బీసీసీఐ జట్టు సహాయక సిబ్బందిలో ముఖ్యమైన మార్పు చేసింది. టీమిండియా నూతన ఫీల్డింగ్ కోచ్‌గా సుభదీప్ ఘోష్‌ను నియమించింది. ఇప్పటివరకు ఈ బాధ్యతల్లో ఉన్న టి. దిలీప్ స్థానంలో అతడు బాధ్యతలు స్వీకరించనున్నాడు. ఆగస్టు 15న గాలెలో జరిగే తొలి టెస్టుతో భారత్-శ్రీలంక సిరీస్ ప్రారంభం కానుంది. రెండో టెస్టు ఆగస్టు 23 నుంచి కొలంబోలోని ఎస్ఎస్‌సీ మైదానంలో జరుగుతుంది. ఈ పర్యటనకు ముందు, భారత జట్టు ఆగస్టు 7 నుంచి కొలంబోలో మూడు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్ ఆడనుంది. ఈ సిరీస్ నుంచే సుభదీప్ ఘోష్ తన బాధ్యతలను మొదలుపెట్టనున్నాడు. 57 ఏళ్ల సుభదీప్ ఘోష్‌కు కోచింగ్‌లో విస్తృతమైన అనుభవం ఉంది. గతంలో రెండేళ్లపాటు భారత మహిళల క్రికెట్ జట్టుకు ఫీల్డింగ్ కోచ్‌గా సేవలందించాడు. 2022 మహిళల వన్డే ప్రపంచకప్, 2023 టీ20 ప్రపంచకప్‌లలో అతను జట్టుతో పనిచేశాడు. అంతేగాక ఇండియా 'ఏ' జట్లకు, అసోం సీనియర్ పురుషుల జట్టుకు హెడ్ కోచ్‌గా కూడా వ్యవహరించాడు. ఆటగాడిగా అసోం, రైల్వేస్ తరఫున 17 ఫస్ట్-క్లాస్, 17 లిస్ట్ 'ఏ' మ్యాచ్‌లు ఆడాడు. ఇంతకుముందు ఫీల్డింగ్ కోచ్‌గా ఉన్న టి.దిలీప్ కాంట్రాక్ట్ ముగియడంతో బీసీసీఐ దానిని పునరుద్ధరించలేదు. 2021 నుంచి 2025 బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ వరకు, ఆ తర్వాత 2025 ఇంగ్లండ్ పర్యటనకు ఏడాది కాంట్రాక్ట్‌పై పనిచేశాడు. మరోవైపు జట్టు సహాయక కోచ్‌గా ఉన్న ర్యాన్ టెన్ డెస్కాటె కూడా తన పదవి నుంచి తప్పుకున్నాడు. ఐపీఎల్ ఫ్రాంచైజీ కోల్‌కతా నైట్ రైడర్స్‌లో 'హెడ్ ఆఫ్ క్రికెట్ స్ట్రాటజీ'గా కొత్త బాధ్యతలు చేపట్టాడు. గత ఏడాది నవంబర్‌లో దక్షిణాఫ్రికాతో స్వదేశంలో సిరీస్ ఆడిన తర్వాత, భారత్ ఆడబోతున్న తొలి వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) సిరీస్ ఇదే కావడం గమనార్హం. ఈ నేపథ్యంలో కొత్త ఫీల్డింగ్ కోచ్ నియామకం జట్టు ప్రదర్శనపై ఎలాంటి ప్రభావం చూపుతుందో చూడాలి.

# అమెరికా క్రికెటర్ అఖిలేశ్ రెడ్డిపై ఐసీసీ నిషేధం...

అంతర్జాతీయ క్రికెట్‌లో మరో అవినీతి ఉదంతం కలకలం రేపింది. అమెరికా (యూఎస్ఏ) క్రికెటర్ బొడుగం అఖిలేశ్ రెడ్డిపై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఎనిమిదేళ్ల పాటు నిషేధం విధించింది. 2025లో జరిగిన అబుదాబి టీ10 లీగ్‌లో అఖిలేశ్ రెడ్డి అవినీతి నిరోధక నియమావళిని ఉల్లంఘించినట్లు తేలడంతో ఐసీసీ ఈ కఠిన చర్యలు తీసుకుంది. ఈ నిషేధం 2025 నవంబర్ 21 నుంచే అమల్లోకి వచ్చినట్లు ఐసీసీ వెల్లడించింది. ఐసీసీ యాంటీ కరప్షన్ ట్రైబ్యునల్ విచారణలో అఖిలేశ్ రెడ్డిపై మూడు ప్రధాన ఆరోపణలు రుజువయ్యాయి. టీ10 లీగ్‌లో మ్యాచ్ ఫలితాన్ని ప్రభావితం చేసేందుకు ప్రయత్నించడం, సహచర ఆటగాడిని ఉద్దేశపూర్వకంగా ఎక్కువ పరుగులు ఇవ్వాలని కోరడం, విచారణను అడ్డుకునే ఉద్దేశంతో తన ఫోన్‌లోని వాట్సాప్ సందేశాలు, కాల్ లాగ్‌లను డిలీట్ చేయడం వంటి నేరాలకు పాల్పడినట్లు ట్రైబ్యునల్ నిర్ధారించింది. 2025 నవంబర్ 19న అస్పిన్ స్టాలియన్స్ జట్టు తమ తొలి మ్యాచ్ ఆడటానికి ముందురోజు, అఖిలేశ్ రెడ్డి హోటల్ గదిలో తన సహచర బౌలర్‌ను కలిసి, ఎక్కువ పరుగులు ఇవ్వాలని కోరాడు. టీమ్ మేనేజ్‌మెంట్ సూచన మేరకే తాను ఇలా అడుగుతున్నట్లు అతడిని నమ్మించే ప్రయత్నం చేశాడు. అయితే, సదరు ఆటగాడు ఇందుకు నిరాకరించి, ఈ విషయాన్ని వెంటనే ఐసీసీ యాంటీ కరప్షన్ యూనిట్ దృష్టికి తీసుకెళ్లాడు. విచారణలో భాగంగా ఫోన్‌లోని డేటాను డిలీట్ చేయడంపై అఖిలేశ్ ఇచ్చిన వివరణలను ట్రైబ్యునల్ తోసిపుచ్చింది. 26 ఏళ్ల అఖిలేశ్ రెడ్డి అమెరికా తరఫున ఇప్పటివరకు నాలుగు టీ20 మ్యాచ్‌లు ఆడాడు.

# భువనేశ్వర్‌కు జై కొట్టిన అర్ష్‌దీప్.. బుమ్రాకు నో ప్లేస్




భారత యువ ఫాస్ట్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్, తన దృష్టిలో అత్యుత్తమ ఐదుగురు భారత బౌలర్ల జాబితాను ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఈ జాబితాలో సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్‌కు అగ్రస్థానం ఇవ్వగా, ప్రపంచంలోని మేటి బౌలర్లలో ఒకడిగా పేరున్న జస్ప్రీత్ బుమ్రాకు చోటు కల్పించకపోవడం చర్చనీయాంశమైంది. ఓ యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అర్ష్‌దీప్ ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. భువనేశ్వర్ కుమార్ తన వ్యక్తిగత ఫేవరెట్ అని, అందుకే అతడికి మొదటి స్థానం ఇచ్చానని అర్ష్‌దీప్ స్పష్టం చేశాడు. కొత్త బంతితో అతడి నియంత్రణ అద్భుతంగా ఉంటుందని ప్రశంసించాడు. "భువీ భాయ్ నా ఫేవరెట్ కాబట్టి అతడికే అగ్రస్థానం. ఈ విషయంలో నేను కొంచెం పక్షపాతంతో ఉన్నాను" అని నవ్వుతూ చెప్పాడు. ఈ జాబితాలో రెండో స్థానంలో మహమ్మద్ షమీని ఎంచుకున్నాడు. ఏ వికెట్‌పైనైనా బంతిని సీమ్ చేయగల సత్తా షమీకి ఉందని, అతడి బౌలింగ్, సీమ్ ప్రెజెంటేషన్ అద్భుతంగా ఉంటుందని కితాబిచ్చాడు. ఆ తర్వాత స్పిన్నర్లకు ప్రాధాన్యత ఇచ్చాడు. అరుదైన నైపుణ్యం ఉన్న లెఫ్ట్ ఆర్మ్ చైనామన్ బౌలర్ కుల్దీప్ యాదవ్‌కు మూడో స్థానం కట్టబెట్టాడు. నాలుగో స్థానంలో యుజ్వేంద్ర చాహల్‌ను నిలిపాడు. చాహల్ తనకు పంజాబ్ జట్టు సహచరుడని, అతడి రికార్డు కూడా అద్భుతంగా ఉందని పేర్కొన్నాడు. ఇక, ఐదో స్థానంలో సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్‌ను ఎంచుకున్నాడు. అయితే, అశ్విన్‌ను చివరి స్థానంలో ఉంచినందుకు సరదాగా క్షమాపణలు చెప్పాడు. "అయ్యో.. యాష్ భాయ్‌ను చివరి స్థానంలో ఉంచాలని లేదు. కానీ, వేరే స్థానాలు ఖాళీగా లేవు. పంజాబ్ జట్టులో నా మొదటి ఐపీఎల్ కెప్టెన్ ఆయనే. క్షమించండి యాష్ భాయ్, మీకు వ్యక్తిగతంగా మెసేజ్ చేస్తాను" అని అర్ష్‌దీప్ సరదాగా వ్యాఖ్యానించాడు. మొత్తం మీద అర్ష్‌దీప్ జాబితాలో ఇద్దరు పేసర్లు, ముగ్గురు స్పిన్నర్లకు చోటు దక్కింది. అయితే, ఆధునిక క్రికెట్‌లో అత్యుత్తమ బౌలర్‌గా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన జస్ప్రీత్ బుమ్రా పేరు లేకపోవడం క్రీడా వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది.

# అంతర్జాతీయ వేదికపై కశ్మీరీ ఎంఎంఏ ఫైటర్ సత్తా

## ఛాంపియన్‌కు చుక్కలు చూపిన ఓవైస్ యాకూబ్


అంతర్జాతీయ మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ (ఎంఎంఏ) యవనికపై ఓ భారతీయ యువకుడు సంచలనం సృష్టించాడు. జమ్మూ కశ్మీర్‌కు చెందిన ఓవైస్ యాకూబ్, బల్గేరియాలో జరిగిన ప్రతిష్ఠాత్మక బ్రేవ్ సీఎఫ్ 107 ఈవెంట్‌లో అద్భుత విజయాన్ని నమోదు చేశాడు. ఇప్పటివరకు ఓటమి ఎరుగని, రెండుసార్లు ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన బల్గేరియా ఫైటర్ డెల్యన్ జార్జివ్‌ను మట్టికరిపించి చరిత్ర సృష్టించాడు. ఈ విజయం పట్ల జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా హర్షం వ్యక్తం చేస్తూ ఓవైస్‌కు అభినందనలు తెలిపారు. ఒమర్ అబ్దుల్లా కార్యాలయం 'ఎక్స్' వేదికగా ఈ విషయాన్ని వెల్లడించింది. "బల్గేరియాలో అజేయ ప్రపంచ ఛాంపియన్‌ను ఓడించి అద్భుత విజయం సాధించిన జమ్మూ కశ్మీర్ ఎంఎంఏ ఫైటర్ ఓవైస్ యాకూబ్‌కు ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు. ఇది జమ్మూ కశ్మీర్‌తో పాటు దేశానికే గర్వకారణం. భవిష్యత్తులోనూ అతను మరిన్ని విజయాలు సాధించి, అంతర్జాతీయ వేదికపై దేశ కీర్తిని ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు" అని పేర్కొంది. ఆగస్టు 1న బల్గేరియాలోని బుర్గాస్ ఎరీనాలో జరిగిన ఈ పోరులో ఓవైస్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించాడు. మొదటి రౌండ్ ప్రారంభమైన కేవలం 4 నిమిషాల్లోనే టెక్నికల్ నాకౌట్ (టీకేఓ) ద్వారా డెల్యన్ జార్జివ్‌ను ఓడించి తన కెరీర్‌లో చిరస్మరణీయ విజయాన్ని అందుకున్నాడు. ఈ ఓటమితో జార్జివ్ కెరీర్‌లో తొలి పరాజయం నమోదైంది. దక్షిణ కశ్మీర్‌లోని పుల్వామా జిల్లా మురాన్ గ్రామానికి చెందిన ఓవైస్, ఈ పోరులో అద్భుతమైన నిలకడ, పట్టుదల, సాంకేతిక నైపుణ్యాన్ని ప్రదర్శించి అందరి మన్ననలు పొందాడు. విజయం అనంతరం ఓవైస్ యాకూబ్ మాట్లాడుతూ.. "ఈ విజయం నాకు సర్వస్వం. నా కుటుంబం, జమ్మూ కాశ్మీర్ ప్రజలు, యావత్ దేశం ఆశలను మోస్తూ నేను బరిలోకి దిగాను. అజేయ ప్రపంచ ఛాంపియన్‌ను ఓడించడం ఒక కల నిజమైన క్షణం. అయితే ఇది ఆరంభం మాత్రమే. మరింత కష్టపడి పనిచేసి, ప్రపంచ వేదికపై గర్వంగా భారతదేశానికి ప్రాతినిధ్యం వహిస్తూ మరిన్ని విజయాలు సాధిస్తాను" అని అన్నాడు. గతంలో కశ్మీర్ నుంచి పలువురు రెజ్లర్లు జాతీయ స్థాయిలో రాణించినప్పటికీ, ఎంఎంఏ క్రీడలో ఓవైస్ సాధించినటువంటి అంతర్జాతీయ మైలురాయిని ఇంతవరకు ఎవరూ చేరుకోలేదు.

# వారణాసి కథలో భారీ బలముంది

**అందుకే ఐమ్యాక్స్ ఫార్మాట్ ఎంచుకున్నా**

**దర్శకధీరుడు జక్కన్న వెల్లడి**

స్టార్ హీరో మహేశ్‌బాబు కథానాయకుడిగా ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ అడ్వెంచర్ ఫిల్మ్ 'వారణాసి'లో ప్రియాంక చోప్రా కథానాయిక. పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. టైమ్ ట్రావెల్ కథాంశం, భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ మూవీకి సంబంధించిన కీలక అప్‌డేట్‌ను జక్కన్న పంచుకున్నారు. ఇటీవల ఓ ఇంటర్నేషనల్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో 'వారణాసి' ప్రస్తుత పరిస్థితితో పాటు, ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఇప్పటికే 'వారణాసి' 80 శాతం షూటింగ్ పూర్తయింది. ఇంకా 20శాతం ఉంది. ఈ సినిమాకు సంబంధించి కీలక సన్నివేశాలు, యాక్షన్ సీక్వెన్స్ పూర్తి చేశాం. మిగిలినవి చిన్న చిన్న సన్నివేశాలే. 2022 నుంచి 'వారణాసి' కథను డెవలప్ చేయడం మొదలు పెట్టాం. అంటే దాదాపు నాలుగున్నరేళ్లు పట్టిందని వివరించారు. వారణాసి' గురించి అన్నీ ఇప్పుడే చెప్పలేం. 'ఇండియానా జోన్స్' అంటే నాకు చాలా ఇష్టం. ఆ కథ, హీరో చేసే సాహసాలు చిన్న పిల్లలకు నచ్చుతాయి. నాకూ సరదాగా అనిపిస్తాయి. కథ, దాని నేపథ్యం తెలియకుండా ప్రేక్షకులు సినిమాను ఆస్వాదించలేరని నా అభిప్రాయం. అందుకే 'వారణాసి'కి సంబంధించి వీడియో ప్రత్యేకంగా ఉండేలా గ్లింప్స్‌ను విడుదల చేశాం. దీన్ని మీరు పరిశీలిస్తే, కథ వారణాసిలో మొదలై అంటార్కిటికా, ఆఫ్రికాల్లో ప్రయాణించి రామాయణ కాలానికి తీసుకెళ్తుంది. మళ్లీ వారణాసికి తీసుకొస్తుందన్నారు. ఇక ఈ కథలో ఉన్న భారీదనమే ఐమ్యాక్స్ ఫార్మాట్‌లో తీయడానికి కారణం. అంటార్కిటికాలో 300 అడుగులకు పైగా ఉన్న భారీ మంచు కొండ, రామాయణంలోని భారీ వానర సేన ఇలా ఎన్నో కీలక సన్నివేశాలు ఇందులో ఉన్నాయి. అవన్నీ అద్భుతంగా, విశాలంగా చూపించాలంటే ఐమ్యాక్స్ సరైనదనిపించింది. దీని వల్ల సినిమాకు అదనపు హంగు జోడించినట్లైందన్నారు. ఐమ్యాక్స్ కెమెరాలను పూర్తిగా వాడిన దర్శకుడు క్రిస్టఫర్ నోలన్. ఆయనంటే నాకు చాలా ఇష్టం. నోలన్‌ను నేనెప్పుడూ కలవలేదు. హాలీవుడ్ సినిమాలంటే నాకు ఆసక్తి. చిన్నప్పటి నుంచి వాటిని చూస్తూ పెరిగాను. ఆ ప్రభావం నా సినిమాలపై ఉంటుంది. నా సినిమాలను హాలీవుడ్ చిత్రాలతో పోలుస్తుంటారు. అందుకు నేనెప్పుడూ ఇబ్బంది పడనని అన్నారు. గత చిత్రానికి భిన్నంగా జక్కన్న 'వారణాసి'ని పరుగులు పెట్టిస్తున్నట్లు తాజా అప్‌డేట్ చూస్తే అర్థమవుతోంది. ఒకవైపు షూటింగ్ చేస్తూనే మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా వేగంగా చేస్తున్నారు. పలు అంతర్జాతీయ వీఎఫ్ఎక్స్ కంపెనీలు ఈ సినిమా కోసం పనిచేస్తున్నాయి. దుర్గా ఆర్ట్స్ పతాకంపై కేఎల్. నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఎంఎం కీరవాణి సంగీతం అందిస్తున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ఈ మూవీని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.





# ఇరుముడి నుంచి యాలాలో.. యాలాలో పాట విడుదల

**21న విడుదలకు సిద్ధం అవుతున్న చిత్రం**

మాస్ మహారాజా రవితేజ హీరోగా, కుటుంబ కథా చిత్రాల దర్శకుడు శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'ఇరుముడి' పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్న ఈ ఎమోషనల్ ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. సినిమా విడుదలకు సమయం దగ్గరపడుతుండటంతో ప్రమోషన్లను మేకర్స్ వేగవంతం చేశారు. ఈ నేపథ్యంలో చిత్రం నుంచి రెండో సింగిల్ 'యాలాలో యాలాలో.. వెన్నెల్లో ఎన్నెన్ని ముచ్చట్లో..' అనే మధురమైన ఫ్యామిలీ మెలోడీని విడుదల చేశారు. కుటుంబ బంధాలు, ఆప్యాయత, భావోద్వేగాలను ప్రతిబింబించేలా రూపొందిన ఈ పాట తొలి వినికిడిలోనే ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఈ పాటకు ప్రముఖ గేయ రచయిత అనంత శ్రీరామ్ హృదయాన్ని హత్తుకునే సాహిత్యం అందించగా, సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్ తన మెలోడీ స్వరాలతో పాటను మరింత అందంగా తీర్చిదిద్దారు. విడుదల చేసిన పోస్టర్‌లో రవితేజ తన కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా కనిపించడం సినిమా భావోద్వేగ నేపథ్యాన్ని ప్రతిబింబిస్తోంది. ఇప్పటికే విడుదలైన తొలి పాట 'ఇరుముడి కట్టు' భక్తి గీతంగా మంచి ఆదరణ పొందింది. యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లో నిలిచిన ఆ పాట తర్వాత ఇప్పుడు 'యాలాలో యాలాలో'తో సినిమా మరోసారి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. 'ఇరుముడి'లో రవితేజ ఇప్పటివరకు చేయని ఓ విభిన్నమైన పాత్రలో కనిపించనున్నారని చిత్రబృందం చెబుతోంది. తండ్రీ?కూతుళ్ల అనుబంధాన్ని ప్రధానాంశంగా తీసుకున్న ఈ కథలో అయ్యప్ప స్వామి దీక్షకు కూడా కీలక ప్రాధాన్యం ఉంది. తన కూతురి కోసం జీవితాన్ని మార్చుకునే ఓ తండ్రి ప్రయాణాన్ని భావోద్వేగభరితంగా చూపించనున్నట్లు తెలుస్తోంది. సోషల్ మీడియాలో సినిమా విడుదల తేదీపై వస్తున్న ఊహాగానాలకు కూడా మేకర్స్ తెరదించారు. ముందుగా ప్రకటించినట్లుగానే ఆగస్టు 21న 'ఇరుముడి' ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుందని అధికారికంగా స్పష్టం చేశారు. కుటుంబ అనుబంధాలు, ఆధ్యాత్మికత, మాస్ యాక్షన్ అంశాల సమ్మేళనంగా రూపొందుతున్న 'ఇరుముడి' రవితేజ కెరీర్‌లో మరో ప్రత్యేక చిత్రంగా నిలుస్తుందనే నమ్మకంతో అభిమానులు ఎదురుచూస్తున్నారు.

# నితిన్ హీరోగా నాని మూవీ

## అలియాస్ రుక్మిణీ అనే టైటిల్




హీరోగా వరుస విజయాలతో దూసుకుపోతూనే, అభిరుచి గల చిత్రాలను నిర్మిస్తూ నిర్మాతగానూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నాడు నేచురల్ స్టార్ నాని. ఇప్పుడు మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. తాజాగా నాని సమర్పణలో హీరో నితిన్ ప్రధాన పాత్రలో రూపొందుతున్న కొత్త చిత్రానికి 'అలియాస్ రుక్మిణీ ' అనే విభిన్నమైన టైటిల్‌ను ఖరారు చేస్తూ చిత్రబృందం ప్రత్యేక గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతూ సినీ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఈ చిత్రానికి యువ దర్శకుడు మురళీకాంత్ దర్శకత్వం వహిస్తున్నారు. కథలో కొత్తదనం, ఆసక్తికరమైన కాన్సెప్ట్ ఉన్నట్లు టైటిల్ గ్లింప్స్ ద్వారా మేకర్స్ హింట్ ఇచ్చారు. ముఖ్యంగా ఈ వీడియోకు నాని అందించిన వాయిస్ ఓవర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గ్లింప్స్ ప్రారంభంలో నితిన్ ఇంజినీరింగ్ పుస్తకాల మధ్య నిద్రపోతూ కనిపిస్తాడు. అయితే అతని ముందు కనిపించే పుస్తకాల పేర్లు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. 'గరం గోపాల్', 'ఆమెకు ఆమెంటే ఇష్టం', 'వత్రం వెంకన్న' వంటి వినూత్న శీర్షికలతో ఉన్న పుస్తకాలను చూపిస్తూ వాటి రచయితగా 'రుక్మిణి' అనే పేరును ప్రస్తావిస్తారు. దీంతో ఈ రుక్మిణి ఎవరు? అనే ఆసక్తి ప్రేక్షకుల్లో పెరుగుతుంది.ఆ సమయంలో నాని వాయిస్ ఓవర్‌లో రుక్మిణి గురించి వివరిస్తుండగా, చివర్లో నితిన్ 'ఆమె నా భార్య' అని చెప్పడం గ్లింప్స్‌కు ఆసక్తికర ముగింపునిచ్చింది. ఈ ఒక్క డైలాగ్‌తోనే సినిమా కథపై మరింత క్యూరియాసిటీ పెరిగింది. 'అలియాస్ రుక్మిణి' అనే టైటిల్ వెనుక ఉన్న రహస్యం ఏమిటి? రుక్మిణీ పాత్ర కథలో ఎంత కీలకమనే అంశాలపై చర్చ మొదలైంది. నితిన్ కెరీర్‌లో ఇది మరో విభిన్నమైన కథాంశంతో తెరకెక్కుతున్న చిత్రం అని తెలుస్తోంది. రొమాన్స్, కామెడీ, ఎమోషన్స్‌తో పాటు ఒక ప్రత్యేకమైన కాన్సెప్ట్‌ను ఈ సినిమాలో మేకర్స్ చూపించబోతున్నట్లు గ్లింప్స్ ద్వారా అర్థమవుతోంది. నాని సమర్పణలో వస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే మంచి అంచనాలు ఏర్పడ్డాయి. గతంలో నాని నిర్మాణంలో వచ్చిన పలు చిత్రాలు విమర్శకుల ప్రశంసలతో పాటు ప్రేక్షకాదరణ కూడా పొందాయి. దీంతో 'అలియాస్ రుక్మిణి' కూడా కంటెంట్ ఆధారిత చిత్రంగా నిలుస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా కొనసాగుతోంది. త్వరలోనే హీరోయిన్, ఇతర నటీనటులు, విడుదల తేదీకి సంబంధించిన పూర్తి వివరాలను చిత్రబృందం ప్రకటించనుంది. టైటిల్ గ్లింప్స్‌తోనే ఆసక్తిని పెంచిన 'అలియాస్ రుక్మిణి' ప్రేక్షకులను ఏ స్థాయిలో అలరిస్తుందో చూడాలి.

# దంపతుల మధ్య అనురాగం నిత్యనూతనం

**విశ్వనాథ్ అండ్ సన్స్ హీరో సూర్య**



ప్రముఖ నటుడు సూర్య, మమితా బైజు ప్రధానపాత్రలో నటించిన చిత్రం 'విశ్వనాథ్ అండ్ సన్స్' వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఆగస్టు 14న థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ఆడియో విడుదల వేడుకలో హీరో సూర్య ప్రేమ, పెళ్లి, దంపతుల మధ్య పరస్పర గౌరవం గురించి మాట్లాడారు. ప్రేమ అనేది పెళ్లితో ముగిసిపోయేది కాదు. బంధంలో అనురాగం ప్రతిరోజూ వ్యక్తమవ్వాలి. భాగస్వామిని జీవితాంతం ప్రతి రోజూ ప్రేమిస్తూనే ఉండాలి. ఆమెతో 20 ఏళ్లు గడిపినా కూడా ప్రేమ తగ్గకూడదు. ఎప్పుడూ ఒ క ి రి క ొ క ి ం గౌరవించుకోవాలి. వయసు పెరిగే కొద్దీ మనుషుల్లో మార్పులు సహజం. 25, 30 ఏళ్ల వయసులో ఉండే ఆలోచనలు, ప్రాధాన్యతలు తర్వాత మారిపోతాయి. జీవితం ఎలా ఉన్నా.. మన భాగస్వామిపై ఉండే ప్రేమ, ఆప్యాయత మాత్రం ఎప్పటికీ మారకూడదని చెప్పారు. సమాజంలో, కుటుంబంలో మహిళల పాత్రను, వారి త్యాగాలను సూర్య ప్రస్తావించారు. 'ప్రతి కుటుంబంలో పురుషుడి కంటే మహిళలు ఎక్కువ కష్టపడతారు. ఇల్లు చూసుకోవడం, పిల్లలకు జన్మనివ్వడం వంటి విషయాల్లో వారు ఎన్నో త్యాగాలు, సర్దుబాట్లు చేస్తారు. వాటికి ఎప్పుడూ గౌరవం ఇవ్వాలి. ప్రేమ పంచడంతో పాటు వాళ్లకు గౌరవం ఇవ్వడమూ ముఖ్యమని సూర్య చెప్పారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ మమితా బైజుమాట్లాడుతూ, చిన్నప్పటి నుంచి తనకు సూర్య అంటే ఎంతో ఇష్టమని వెల్లడించారు. 'గతంలో సూర్యతో పనిచేసే మంచి అవకాశాన్ని కోల్పోయాను. కానీ దేవుడి దయ వల్ల ఈ సినిమాలో నటించే ఛాన్స్ వచ్చింది. ఆయనతో కలిసి పనిచేయడం ఎంతో సంతోషంగా ఉంది. ఆయన నిజమైన జెంటిల్‌మన్' అని మమితాబైజు అన్నారు. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందించిన ఈ చిత్రంలో రాధికా శరత్‌కుమార్, రవీనా టాండన్, నాజర్ కీలక పాత్రలు పోషించారు.



# తొలిసారిగా బేబీ బంప్ ఫొటోలు షేర్ చేసిన సమంత

స్టార్ హీరోయిన్ సమంత తన జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించి, అభిమానులకు మరిచిపోలేని సర్‌ప్రైజ్ ఇచ్చారు. ఇటీవల తాను గర్భవతినని వెల్లడించిన సమంత, ఇప్పుడు తొలిసారిగా బేబీ బంప్‌తో ఉన్న అధికారిక ఫొటోను పంచుకోవడంతో నెట్టింట ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ఈ తాజా చిత్రంలో ఆమె మస్టర్డ్ యెల్లో రంగు కేప్ గౌన్‌లో, టర్క్వాయిస్ డ్రాప్ ఇయర్‌రింగ్స్, స్టైలిష్ బన్ హెయిర్‌స్టైల్‌తో ఎంతో అందంగా కనిపించారు. ప్రస్తుతం ఈ ఫొటో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతుండటంతో అభిమానులు, సినీ ప్రముఖులు ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఒకవైపు కెరీర్‌లో వరుస విజయాలను సాధిస్తూనే, మరోవైపు మాతృత్వపు తీపి అనుభూతిని స్వాగతించేందుకు సమంత సిద్ధమవుతున్నారు. ఇటీవల తన భర్త, దర్శకనిర్మాత రాజ్ నిడిమోరుతో కలిసి తమ తొలి బిడ్డకు స్వాగతం పలకబోతున్నట్లు ప్రకటించినప్పటి నుంచి, ఆమె వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ప్రతి చిన్న అప్‌డేట్ కోసం ఫ్యాన్స్ ఎదురుచూస్తున్నారు. ఇప్పుడు ఆమె నేరుగా బేబీ బంప్ ఫొటోను షేర్ చేయడంతో అభిమానుల ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. మరోవైపు, వృత్తిగత జీవితంలోనూ సమంత విజయాల పరంపర దిగ్విజయంగా కొనసాగుతోంది. ఆమె ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'మా ఇంటి బంగారం' చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని సాధించింది. సమంత సోలో హీరోయిన్‌గా నటించిన చిత్రాల్లోనే అత్యధిక వసూళ్లు సాధించిన సినిమాగా ఇది సరికొత్త చరిత్ర సృష్టించింది. రాబోయే రోజుల్లో సమంత పూర్తి ఆరోగ్యంతో ఉంటూ, ఈ కొత్త జీవితంలోకి సంతోషంగా అడుగుపెట్టాలని కోరుకుంటూ నెటిజన్లు సోషల్ మీడియాలో ప్రార్థనలు, శుభాకాంక్షల వర్షం కురిపిస్తున్నారు.

PRINTED, PUBLISHED & OWNED By Rolla Raghunath Reddy, PRINTED at Teja Cards & Stationery (Printing & Stationery Supplyers) #78-1-26, Thunnuguntla Vari Street Lalapeta, Guntur - 522001.
EDITOR : Rolla Raghunath Reddy, #4-6-13, Library Road, Koritipadu 1st Lane, Near RCM School, Chandramoulinagar Guntur - 522007. Andhra Pradesh. E-mail: bharathprathinidhi@gmail.com Phone No: 8121214342